# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 సంచిక : 267 సోమవారం 22 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




# ఈ నెల 24న ఇంటర్ ఫలితాలు

- ప్రథమ, ద్వితీయ ఏడాది పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు ఒకేసారి వెల్లడి
- గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 15 రోజుల ముందుగానే ఫలితాలు
- మార్కుల నమోదులో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు

# వీరి ఓట్లే కీలకం..

- జోరందుకున్న ప్రచారం..
- మరింతగా ప్రజల్లోకి వెళ్ళాలని నేతల ప్లాన్
- ఎన్నికల్లో రాజకీయ నేతలు తమతమ గెలుపుపై దృష్టి
- రోడ్ షోలు, ఇంటింటికి ప్రచారం, బస్తీ సభలు నిర్వహిస్తూ బిజిబిజీ
- తమ వైపు తిప్పుకునేల విద్యార్థి సంఘాల నాయకులతో పలు పార్టీలకు చెందిన నేతలు తమకు మద్దతు తెలపాలని కోరుతున్నట్లు సమాచారం
- పార్లమెంట్ ఎన్నికల్లో యువతను తమ వైపు తిప్పుకునేలా ముఖ్య నేతలు వారికి అఫర్లు




హైదరాబాద్

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరందుకోనుంది.. ఇప్పడికే పలు పార్టీల నేతలు ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మరింతగా ప్రజల్లోకి వెళ్ళాలని నేతలు ప్లాన్ చేసుకుంటున్నారు. ఎన్నికల్లో రాజకీయ నేతలు తమతమ గెలుపుపై దృష్టి సారించారు. రోడ్ షోలు, ఇంటింటికి ప్రచారం, బస్తీ సభలు నిర్వహిస్తూ బిజిబిజిగా మారిపోయారు. నియోజకవర్గ ప్రజలకోసం తాము చేసిన, చేయబోతున్న పనులను వివరించేలా ప్లాన్ చేస్తున్నారు. అయితే తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా ప్రధాన పార్టీల ఫోకస్ అంతా యువతపైనే ఉంటుంది. దీని కోసం యునివర్సీటిల్లో చదువుతున్న విద్యార్థులను ప్రచారంలో పాల్గోనేలా నేతలు వర్సీటీల విద్యార్థులతో మంతనాలు జరుపుతున్నారు. తెలంగాణలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓట్లే కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు -మిగతా3లో




# ఇండియా కూటమి వినూత్న నిరసన

- కేజ్రీవాల్, సోరెన్ పేర్లతో ఖాళీ కుర్చీలు..
- అక్రమంగా తమ నేతలను అరెస్టు చేశారని ప్రతిపక్షాల ఆరోపణ
- ర్యాలీలో కేజ్రీవాల్, సోరెన్‌లకు ప్రత్యేకంగా కుర్చీలు వేసి వినూత్నంగా నిరసన
- 'ఉలుగులన్ న్యాయ్ మహార్యాలీ' పేరుతో జార్ఖండ్ ముక్తి మోర్చా ర్యాలీ

# కాంగ్రెస్ పార్టీ అస్థిరతకు మారుపేరు

- భారత్‌ను కాంగ్రెస్ ఎన్నడూ బలోపేతం చేయదు.. ప్రధాని మోదీ ధ్వజం
- ఎన్నికల్లో పోరాడి గెలవలేని వారు రాజ్యసభకు వచ్చారు
- దేశంలోని ప్రతి ఇంటికి తాగు నీరు, రైతులకు సాగు నీరు చేరేలా చూడటం నా లక్ష్యం
- గత 5 సంవత్సరాలలో జల్ జీవన్ మిషన్ కింద 11 కోట్లకు పైగా కుటుంబాలు లబ్ది పొందాయి
- కాంగ్రెస్‌కు 300 స్థానాల్లో పోటీ చేసే సత్తా లేదు



# ఏపీలో నాకే బిల్లులు రావాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- వైసీపీ గెలుపు కోసం అభ్యర్థులకు డబ్బులు పంపిస్తున్నారని ఆరోపణలు
- వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్.. ఏ పార్టీకి తాను డబ్బులు ఇవ్వడంలేదు
- ఏపీ నుంచి తనకు చాలా బిల్లులు రావాల్సి ఉంది
- తాను కష్టాల్లో ఉంటే డబ్బులు ఎలా ఇస్తా
- రాజకీయాలు, స్నేహాలు, బంధుత్వాలు వేరువేరు
- ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తాను కోరుకుంటున్నా



హైదరాబాద్

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెరవెనక సంబంధాలు నడుస్తుంటాయి. గత ఎన్నికల్లో వైసీపీ గెలుపొందడానికి కేసీఆర్ డబ్బులు పంపించాడంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు డబ్బులు సెటిల్ చేశారంటూ భారత రాష్ట్ర సమితి నేతలు ప్రత్యారోపణలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బును ప్రభావితం చేసే అంశాలు అనేకం ఉంటాయి.

తాజాగా దీనిపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ ఛానెల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగన్ తో ఎక్కువ సాన్నిహిత్యం ఉండటంవల్ల వైసీపీ గెలుపు కోసం -మిగతా3లో



# రాష్ట్రంలో తమకు భద్రత లేదు

- నాకు, నా మేనల్లుడికి రక్షణ లేదు'
- మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు
- బీజేపీ తనను, తన మేనల్లుడిని టార్గెట్ చేస్తోంది
- బీజేపీ కుట్రలకు మేం బయపడం.

# మెజారిటీ లోక్‌సభ స్థానాలపై ఫోకస్

- తెలంగాణా కాంగ్రెస్ కమాండర్ రేవంత్ రెడ్డి ఈజ్ బ్యాక్!!
- లోక్‌సభ ఎన్నికలలో సత్తా చాటి మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని వ్యూహాలు
- లోక్‌సభ ఎన్నికల బాధ్యతను భుజస్కంధాల మీద వేసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- కాంగ్రెస్‌ను ఏకతాటి మీద నడిపే ప్రయత్నంలో రేవంత్
- సుడిగాలి పర్యటనల ప్లాన్ లో రేవంత్ రెడ్డి
- 17 లోక్‌సభ స్థానాలలో 15 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవాలని భావన



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో సత్తా చాటి మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని వ్యూహాలు పన్నుతోంది. ఇక కాంగ్రెస్ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల బాధ్యతను భుజస్కంధాల మీద వేసుకొని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి దిగారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన ఈ పార్లమెంట్ ఎన్నికలకు కూడా కమాండర్ గా కాంగ్రెస్ దళాన్ని ముందుకు నడిపించనున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో కొడంగల్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమిపాలైన రేవంత్ రెడ్డి ఆ తర్వాత మల్కాజ్‌గిరి -మిగతా3లో

# కాంగ్రెస్ పార్టీ అస్థిరతకు మారుపేరు

**జైపూర్:** యూపీఏ అధికారంలో ఉన్నన్నినాళ్లూ దేశం దివాలా తీసిందని.. ఆ పార్టీ భారత్‌ను ఎన్నడూ బలోపేతం చేయలేదని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలో జరిగిన లోక్ సభ ఎన్నికల ప్రచారంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2014కు ముందు ఉన్న పరిస్థితులు మళ్లీ రావాలని దేశం కోరుకోవడం లేదన్నారు.
కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీపై పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా ఎన్నికల్లో పోటీ చేయలేని నేతలు కొందరికి రాజ్యసభకు వెళ్లేందుకు రాజస్థాన్ అడ్డాగా మారిందన్నారు. తొలుత దక్షిణాది నుంచి కేసీ వేణుగోపాల్, తర్వాత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇప్పుడు మరో నేత రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారని సోనియాగాంధీని ఉద్దేశించి మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు.'కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉంది. ఒకప్పుడు ఆ పార్టీ 400 సీట్లు గెలుచుకుంది.
ఇప్పుడు కనీసం 300 సీట్లలో పోటీ చేయడానికి వాళ్లకు అభ్యర్థులే దొరకడం లేదు. తప్పులు చేసి చేసి ఈ పరిస్థితి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఇండియా కూటమి పేరుతో అవకాశవాద కూటమి ఒకటి ఏర్పాటు చేశారు. కూటమిలోని పార్టీలే 25 శాతం సీట్లలో ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. కాగా, జలోర్‌లో లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భాగంగా పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుంది. "బంధుప్రీతి, అవినీతితో చెదలు పట్టి దేశాన్ని పొట్టన పెట్టుకున్న కాంగ్రెస్‌కు దేశ ప్రజలు శిక్ష విధిస్తున్నారు. ప్రస్తుత ఆ పార్టీ దుస్థితికి కాంగ్రెస్ పార్టీనే కారణం. ఒకప్పుడు 400 సీట్లు గెలిచిన పార్టీ ఇప్పుడు



కనీసం 300 సీట్లలో సొంతంగా అభ్యర్థులను నిలబెట్టలేకపోతోంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పంపారు. కానీ ఆయన్ను మళ్లీ రాష్ట్రంలో చూశారా? ఆ పార్టీ నుంచి మరో నేత ఇప్పుడు రాజ్యసభకు వెళ్లారు.
ఎన్నికల్లో పోరాడి గెలవలేని వారు రాజ్యసభకు వచ్చారు. దేశంలోని ప్రతి ఇంటికి తాగు నీరు, రైతులకు సాగు నీరు చేరేలా చూడటం నా లక్ష్యం. గత 5 సంవత్సరాలలో జల్ జీవన్ మిషన్ కింద 11 కోట్లకు పైగా కుటుంబాలు లబ్ధి పొందాయి. దురదృష్టవశాత్తు రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులో కూడా అవినీతి చేసింది. సీఎం భజన్‌లాల్ నేతృత్వంలో 'హర్ ఘర్ జల్' పథకం కింద అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం"అని మోదీ అన్నారు. రాజస్థాన్‌లో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 12 స్థానాలకు మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న జరగ్గా, మిగిలిన 13 స్థానాలకు ఏప్రిల్ 26న రెండో విడత పోలింగ్ జరగనుంది.

**కాంగ్రెస్‌కు 300 స్థానాల్లో పోటీ చేసే సత్తా లేదు : ప్రధాని మోదీ**

కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ దిగజారుతోందని, గతంలో 400 స్థానాల్లో గెలిచిన ఆపార్టీకి ప్రస్తుతం 300 స్థానాల్లో పోటీ చేసే సత్తా కూడా లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అస్థిరతకు మారుపేరని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లోని జలోర్‌లో ఆదివారం జరిగిన ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన పాపాలకు దేశ ప్రజలు ఆ పార్టీని శిక్షిస్తున్నారని అన్నారు. మీరు ప్రతిసారీ బీజేపీకి ఆశీస్సులు ఇచ్చిన మాదిరిగా ఈ ఎన్నికల్లోని కాషాయ పార్టీకి అండగా నిలవాలని కోరారు. తొలి దశ పోలింగ్‌లో రాజస్థాన్‌లోని పలు నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాయని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ స్థిరమైన ప్రభుత్వాన్ని అందించలేదని రాజస్థాన్ ప్రజలకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్‌తో నడిచేదని, 2014కు ముందున్న పరిస్థితులు తిరిగి రావాలని దేశం కోరుకోవడం లేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ మాజీ చీఫ్ పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు రాజ్యసభ మార్గాన్ని ఎంచుకున్నారని సోనియా గాంధీ పేరు ప్రస్తావించకుండా ప్రధాని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో విజయం సాధించలేమని తెలుసుకున్న నేతలు రేసు నుంచి తప్పుకుని రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు.


# రూ.4.5 కోట్లు చెల్లించాల్సిందే

## సుప్రీంకోర్టులో రాందేవ్ బాబాకు చుక్కెదురు..!!

**ఢిల్లీ:** సుప్రీంకోర్టులో యోగా గురువు రాందేవ్ బాబాకు చుక్కెదురైంది. రాందేవ్ బాబాకు చెందిన పతంపలి యోగ్ పీఠ్ ట్రస్ట్ రూ.4.5 కోట్లు చెల్లించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం అలహాబాద్ కస్టమ్స్ ఎక్సైజ్ సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది.

**ఏం జరిగిందంటే..?**

రాం దేవ్ బాబాకు చెందిన యోగ్ పీఠ్ ద్వారా యోగా క్యాంపులు నిర్వహిస్తుంటారు. యోగా క్యాంపులకు వచ్చే వారి నుంచి డబ్బులు వసూల్ చేస్తారు. మీరట్‌కు చెందిన కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. దానిని రాం దేబ్ బాబా అలహాబాద్ కస్టమ్స్ ఎక్సైజ్ సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేశారు. యోగా పేరుతో డబ్బులు



వసూల్ చేయడం ఆరోగ్యం, ఫిట్ నెస్ కిందకు వస్తోంది. సేవా విభాగం కింద పన్ను చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2006 మార్చి నుంచి 2011 వరకు నిర్వహించిన క్యాంపులతో రూ.4.5 కోట్ల సేవా పన్ను విధించింది. దాంతో రాందేవ్ బాబా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ నిరాశ తప్పలేదు. ఆ రూ.4.5 కోట్లు చెల్లించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

**సేవా పన్ను**

పతంజలి ట్రస్ట్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రాంతాల్లో యోగా క్యాంపులు నిర్వహించే వారు. ఆ శిబిరాల్లో పాల్గొన్న వారి నుంచి విరాళాల రూపంలో డబ్బు వసూల్ చేశారు. అది సేవ కిందకు వస్తుందని, సేవా పన్ను చెల్లించాలని కస్టమ్స్ ఎక్సైజ్ విభాగం అంటోంది. అది సేవా పన్ను కిందకు రాదని పతంజలి వాదిస్తోంది. సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో కూడా రాందేవ్ బాబా కంపెనీకి చుక్కెదురు అయ్యింది.

# రైల్వే ప్రయాణికుల అవస్థలు

**కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం**

**మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారింది**

**జనరల్ బోగీలను తగ్గించి 'ఎలైట్ రైళ్ల'(లగ్జరీ ట్రైన్లను) మాత్రమే ప్రోత్సహిస్తుంది**

**తద్వారా అన్నీ వర్గాల రైల్వే ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతోంది**

**న్యూఢిల్లీ:** బీజేపీ నేతృత్వంలోని కేంద్రం రైల్వే వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రైల్వేలను తన స్నేహితులకు విక్రయించేందుకు ఓ సాకు చూపుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఓ ట్విటర్ యూజర్ షేర్ చేసిన వీడియోను రాహుల్ గాంధీ రీట్వీట్ చేస్తూ.. రైలు ప్రయాణికుల కష్టాలను చూపించారు. రిజర్వ్ బోగీలోనూ ప్రయాణికులు కిక్కిరిసిపోయిన వైనాన్ని, బోగీలో చోటులేక టాయిలెట్ లో కూర్చుని ప్రయాణిస్తున్న అవస్థను ఈ వీడియోలో చూపించారు. మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని, జనరల్ బోగీలను తగ్గించి 'ఎలైట్ రైళ్ల'(లగ్జరీ ట్రైన్లను) మాత్రమే ప్రోత్సహిస్తుందన్నారు. తద్వారా అన్నీ వర్గాల రైల్వే ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతోందంటూ ఎక్స్ వేదికపై పోస్ట్ చేశారు. కన్ఫర్మ్ చేసిన టిక్కెట్లతో కూడా ప్రజలు తమ సీట్లపై



ప్రశాంతంగా కూర్చోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. సామాన్యులు మరుగుదొడ్డిలో దాక్కుని లేదా నేలపై కూర్చొని ప్రయాణం చేయవలసి వస్తోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'మోదీ ప్రభుత్వం తన విధానాలతో రైల్వే వ్యవస్థలను బలహీన పరచి .. రైల్వేను తన స్నేహితులకు విక్రయించేందుకు ఒక సాకు చూపుతుంది అని గాంధీ ఆరోపించారు. సామాన్యులు సౌకర?్యవంతమైన రవాణా కావాలంటే రైల్వేలను నాశనం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని రాహుల్ గాంధీ పిలుపు నిచ్చారు.

**రాహుల్ గాంధీకి అస్వస్థత..**

**రాంచీ మెగా ర్యాలీకి గైర్హాజరు**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఇండియా కూటమి తలపెట్టిన మెగా ర్యాలీకి రావడం లేదని పార్టీ ముఖ్యనేత జైరాం రమేష్ వెల్లడించారు. ఇండియా కూటమి సతనా, రాంచీలలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. కానీ అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారని, దీంతో ఢిల్లీని వదిలి బయటకు వెళ్లే పరిస్థితి లేదని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రాంచీ సభకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇండియా కూటమి ఉమ్మడిగా రెండోసారి ప్రభాత్ తారా మైదానంలో ఉల్గులన్ న్యాయ్ పేరిట మెగా ర్యాలీని నిర్వహించనుంది. మద్యం పాలసీలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టైన 10 రోజుల తర్వాత ఢిల్లీ రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఉమ్మడిగా తొలి సభను నిర్వహించింది. తాజాగా, ఆదివారం రాంచీలో నిర్వహించనున్న రెండో సభను విజయవంతం చేసేందుకు ఇండియా కూటమి నేతలు తరలి వస్తున్నారు.

# మోదీని ఆరాధించే మతం బీజేపీ

## చిదంబరం కీలక వ్యాఖ్యలు

సార్వత్రిక ఎన్నికల ప్రచార హోరు జోరుగా సాగుతోంది. జాతీయ పార్టీల కీలక నేతలు కూడా చురుగ్గా ఎలక్షన్ క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నేత 'పీ చిదంబరం' ఆదివారం బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. బీజేపీ అనేక ఒక రాజకీయ పార్టీ కాదని, ఇప్పుడు అది ప్రధాని నరేంద్ర మోదీని ఆరాధించే మతంగా మారిందని అన్నారు. పదేళ్ల మోదీ పాలనలో వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ పూర్తిగా నశించాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుకుంటున్నట్లు పీ చిదంబరం అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (%జూూూ%) ప్రస్తావించనప్పటికీ.. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమిళనాడులోని మొత్తం 39 ఎంపీ స్థానాలను, పాండిచ్చేరిలోని ఒక సీటును ఇండియా కూటమి గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 14 రోజుల్లో బీజేపీ మేనిఫెస్టోను రూపొందించిందని, దానికి మేనిఫెస్టో అని పేరు పెట్టలేదని, దానిని 'మోదీ కి గ్యారెంటీ' అని పేర్కొన్నారు. బీజేపీ రాజకీయ పార్టీ కాదు.. అది ఒక కల్ట్‌గా మారిందని, ఆ మతం నరేంద్ర మోదీని ఆరాధిస్తున్నదని చిదంబరం అన్నారు. భారతదేశంలో మతపరమైన ఆరాధన బలం పెరుగుతోందని, ఇది నియంతృత్వానికి దారి తీస్తుందని చిదంబరం అన్నారు. దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగమని ఆయన అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో



ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి గురించి పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు.

## మాల్దీవుల్లో పార్లమెంట్ ఎన్నికలు.. మయిజ్జుకు కొత్త పరీక్ష!



**మాలే:** మాల్దీవుల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. నేడు మాల్దీవుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి గెలుపుపై సర్వత్రా చర్చ నెలకొంది. ఈ ఎన్నికలను అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక, ఎన్నికల్లో ఆరు పార్టీలు పోటీలో నిలవగా.. 93 సీట్లకు గాను 368 మంది పోటీలో నిలిచారు. ఇదిలా ఉండగా.. మాల్దీవుల్లో పార్లమెంట్ ఎన్నికలను అధ్యక్షుడు మయిజ్జు పాలనపై ప్రజా తీర్పుగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో మయిజ్జు భారత్ వ్యతిరేక చర్యల నేపథ్యంలో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇక, ఎన్నికల నేపథ్యంలో మయిజ్జు సహాయకుడు ఒకరు మీడియాతో మాట్లాడుతూ..'ఈ ఎన్నికల్లో భౌగోళిక రాజకీయాలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత సైన్యాన్ని వెనక్కి పంపిస్తానని హామీ ఇచ్చి ముయిజ్జు అధికారంలోకి వచ్చారు. ఆ దిశగా ప్రయత్నించారు. కానీ, పార్లమెంటు ఆయనకు సహకరించడం లేదు. ఆయన ఎంపిక చేసిన మంత్రులకు వ్యతిరేకంగా ఓటేసి వారి పదవులు పోయేలా చేసింది' అని తెలిపారు. ఇక, సెప్టెంబర్‌లో మయిజ్జు అధికారం చేపట్టాక భారత వ్యతిరేక వైఖరిని అనుసరించారు. ఈ క్రమంలో అక్కడున్న మన బలగాలను వెనక్కి పంపించారు. చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలకు కీలక కాంట్రాక్టులను కట్టబెట్టారు. ప్రస్తుతం ఆ దేశ పార్లమెంటు సభ్యులు మాత్రం ముయిజ్జు తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. అతడి చర్యలును అడ్డుకోవడానికి మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ కలిసి పనిచేస్తున్నారు.

## అగ్రరాజ్యం ఆంక్షలు విధించటం సరికాదు

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు చెందిన నెత్జా యెహుదా బెటాలియన్‌పై అమెరికా ఆంక్షలు విధించడాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనీయన్లకు వ్యతిరేకంగా మానవ హక్కుల ఉల్లంఘనకు ఈ బెటాలియన్ సైనికలు పాల్పడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అమెరికా



ఈనిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతాయ మీడియాలో కథనాలు వెల్లిడిస్తోంది. నెత్జా యెహుదా బెటాలియన్‌పై అమెరికా ఆంక్షలు విధించడాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ తీవ్రంగా మండిపడ్డారు. ' ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్)పై ఎటువంటి ఆంక్షలు విధించవద్దు. మా సైనికులు ఉగ్రవాదులతో భీకరంగా పోరాడుతున్నారు. ఇటువంటి సమయంలో ఐడీఎఫ్‌కు సంబంధిచిన సైనిక బెటాలియన్‌పై అగ్రరాజ్యం ఆంక్షలు విధించటం సరికాదు. ఇదిపూర్తి అనైతికమైన చర్య. నా నేతృత్వంలోని ఇజ్రాయెల్ ప్రభుత్వం అమెరికా చర్యలను పూర్తిగా వ్యతిరేకిస్తుంది'అని నెతన్యాహు అన్నారు. అదేవిధంగా అమెరికా విధించిన ఆంక్షలను ఇజ్రాయెల్ మంత్రి ఇటమార్ బెన్ జివిర్ తప్పుపట్టారు. 'మా సైనికులపై ఆంక్షలు విధించటం సరికాదు. ఈ చర్యలు చాలా తీవ్రమైవి. నెట్జా యెహుదా సైనికులకు రక్షణ కల్పించాలి'అని అన్నారు. 'యూఎస్ ఆంక్షలకు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి అస్సలు లొంగిపోవద్దు' అని మరో మంత్రి యోవ్ గాలంట్ అన్నారు. అమెరికా ఆంక్షలను ఇజ్రాయెల్ ఫైనాన్స్ మినిస్టర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఖండించారు. 'ఇజ్రాయెల్ తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్న సమయంలో అమెరికా ఐడీఎఫ్ బెటాలియన్‌పై ఆంక్షలు విధించటం ఒక పిచ్చి చర్య. పాలస్తీనా రాజ్యస్థాపనకు అంగీకరించాలని.. ఇజ్రాయెల్ భద్రతనను బలవంతంగా పక్కనపెట్టే ముందస్తు ప్రణాళికలో భాగంగా తీసుకున్న చర్యలు'అని మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ మండిపడ్డారు.

## రాష్ట్రంలో తమకు భద్రత లేదు

కోల్‌కతా : తనకు, తన మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి భద్రత లేదని సీఎం మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుమార్ గంజ్ టీఎంసీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి బిప్లబ్ మిత్రా తరుపున



ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దీదీ మాట్లాడుతూ.. బీజేపీ తనను, తన మేనల్లుడిని టార్గెట్ చేస్తోందన్నారు. రాష్ట్రంలో తమకు భద్రత లేదన్నారు. సోమవారం ఓ అంశం టీఎంసీని, ఆ పార్టీ అగ్రనేతల్ని కుదిపేస్తుందంటూ ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై మమతా బెనర్జీ తాజాగా స్పందించారు. 'బీజేపీ నన్ను, అభిషేక్‌ను టార్గెట్ చేస్తోంది. మేము సురక్షితంగా లేము. అయితే బీజేపీ కుట్రలకు మేం బయపడం. టీఎంసీ నాయకులు.. రాష్ట్ర ప్రజలపై కుట్ర జరగకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము' అని ఆమె అన్నారు. సువేందు అధికారి వ్యాఖ్యలపై స్పందించిన మమతా బెనర్జీ 'తన కుటుంబాన్ని అక్రమ సంపదను కాపాడుకోవడానికి బీజేపీలో చేరిన ఒక దేశద్రోహి ఉన్నాడు. అతని తాటాకు చప్పుళ్లకు మేం బెదరమని స్పష్టం చేశారు.

## ఇండియా కూటమి వినూత్న నిరసన

**రాంచీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టును నిరసిస్తూ ఇండియా కూటమి వినూత్నంగా నిరసన తెలిపింది. ఆదివారం కూటమి ఆధ్వర్యంలో బీజేపీకి వ్యతిరేకంగా జార్ఖండ్‌లో మెగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో 28 ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. అక్రమంగా తమ నేతలను అరెస్టు చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ర్యాలీలో కేజ్రీవాల్, సోరెన్‌లకు ప్రత్యేకంగా కుర్చీలు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. 'ఉలుగులన్ న్యాయ్ మహరల్లీ' పేరుతో జార?ండ్ ముక్తి మోర్చా ర్యాలీ నిర్వహించింది. 'ఉలుగులన్' అంటే విప్లవం అని అర్థం. గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ వారిపై బిర్సా ముండా చేసిన పోరాటంలో ఈ పదం ఉద్భవించింది.
ఇందులో పాల్గొన్న జేఎంఎం కార్యకర్తలు సోరెన్ మాస్కులు ధరించి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోరెన్‌ను జనవరి 31న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భూకుంభకోణానికి సంబంధించిన కేసులో అరెస్టు చేసింది. మార్చి 21న ఈడీ ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది.
వారి అరెస్టుకు వ్యతిరేకంగా.. "జైలు కా తాలా తూటేగా, హేమంత్ సోరెన్ చుటేగా" (జైలు తాళం పగలగొడతాం. హేమంత్ సోరెన్‌ను విడుదల చేస్తారు), "జార్ఖండ్ జుకేగా నహీ" (జార్ఖండ్ తలవంచదు)" వంటి నినాదాలు చేశారు. జేఎంఎం అధినేత శిబు సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

# వీరి ఓట్లే కీలకం..




-మొదటి పేజి తరువాయి

అంచనావేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో యువత ఓట్లు రాజకీయ పార్టీలపై పెను ప్రభావం చూపనున్నాయని వారు స్పష్టం చేస్తున్నారు. అందుకే ప్రతి పార్టీ నేతలు యువతకు ప్రాధాన్యం కల్పించే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తుంది. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాల్లో ఉన్న యునివర్సిటీలు వాటి పరిధిలో ఉన్న కాలేజీల విద్యార్థులను తమ వైపు తిప్పుకునేల విద్యార్థి సంఘాల నాయకులతో పలు పార్టీలకు చెందిన నేతలు తమకు మద్దతు తెలపాలని కోరుతున్నట్లు సమాచారం.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో యువత, నిరుద్యోగులు, స్టూడెంట్ లీడర్స్ కీలకపాత్ర పోషించారని.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత రుజువుకావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో యువతను తమ వైపు తిప్పుకునేలా ముఖ్య నేతలు వారికి అఫర్లు ప్రకటిస్తున్నారు. తమ పార్టీ నేతలను గెలిపిస్తే అన్నిరకాలుగా అండగా ఉంటామని వాగ్ధానాలు కూడా చేస్తుండటంతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఉస్మానియ, కాకతీయ యూనివర్సిటిలకు చెందిన స్టూడెంట్ లీడర్స్ పలు పార్టీల ప్రచారంలో పాల్గోనేందకు సిద్దం అయ్యారు. తమకు నచ్చిన పార్టీ నేతలకు మద్దతు తెలిపేందుకు పార్లమెంట్ నియోజిక వర్గాల్లో ప్రచారం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రధాన పార్టీల నేతలకు మద్దతుగా ప్రచారం చేస్తామంటున్నారు ఓయూ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు. ప్రధాన పార్టీ నేతల కోసం వారు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో పాదయాత్రల తో పాటు డోర్ టూ డోర్ ప్రచారం చేస్తు వారి గెలుపుకోసం కృషి చేస్తామంటున్నారు. ముఖ్యంగా యువతకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీ నేతలనే గెలుపించేందుకు ప్రచారం చేస్తామని దీంతో పాటు తమకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే వారి కోరకు పని చేస్తామంటున్నారు. ఇప్పటికే పలు పార్టీల నేతలు తమను సంప్రదించారని త్వరలోనే వారి తరుపున ప్రచారం చేస్తు యువతను చైతన్య పరుస్తామంటున్నారు ఓయూ విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకులు. తెలంగాణ రాజకీయ నేతల పట్ల యువత కీలక భూమిక పోషించబోతున్నారు. తమ భావి రాజకీయ నేతను పార్టీని ఎంచుకునేందుకు తమవంతు కృషి చేస్తామంటున్నారు తెలంగాణ యువత. దీంతో యువతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు పార్టీల నేతలు.

# మెజార్టీ సీట్లపై కమలం గురి

**రసవత్తరంగా తెలంగాణ రాజకీయాలు**

**పదేళ్ల నుంచి తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రతిపక్షానికి పరిమితమైంది**

**2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి నాలుగు స్థానాలను గెలుచుకుంది బీజేపీ**

**గత ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లను గెలిచిన కషాయం**

**ఈసారి మాత్రం రెండంకెల సంఖ్యను దాటడమే టార్గెట్‌గా పెట్టుకున్న బీజేపీ**



**హైదరాబాద్ :** లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో గత కొద్దిరోజులుగా రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నాయి. పదేళ్ల నుంచి తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రతిపక్షానికి పరిమితమైంది. కీలకమైన ఎన్నికల వేళ చాలా మంది నేతలు ఇతర పార్టీలోకి వెళ్తున్నారు. మరోవైపు బీజేపీ ఈసారి మెజార్టీ సీట్లలో పాగా వేయాలని చూస్తోంది. కాంగ్రెస్ కూడా ఇదే లక్ష్యంతో ఉండటంతో ఈసారి ఎవరికి ఎన్ని సీట్లు దక్కుతాయనేది ఆసక్తికరంగా మారింది .2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి నాలుగు స్థానాలను గెలుచుకుంది బీజేపీ. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో ఓ సంచలనం అని చెప్పొచ్చు. బీఆర్ఎస్ అడ్డాగా చెప్పుకునే కరీంనగర్, నిజామాబాద్ లో బీజేపీ విక్టరీ కొట్టింది. వీటితో పాటు ఆదిలాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. ఆయా స్థానాల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని బీజేపీ?. ఏకంగా నాలుగు స్థానాలను ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో?. తెలంగాణపై భారీగా ఆశలు పెట్టుకుంటూ వస్తోంది కాషాయదళం. ఆ తర్వాత జరిగిన దుబ్బాక, హుజురాబాద్ ఉపఎన్నికతో పాటు జీహెచ్ఎంసీలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించి? ప్రధాన పార్టీలకు గట్టి సవాల్ విసిరింది. ఓ దశలో తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అనే పరిస్థితికి వచ్చింది. అయితే తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలపై ఆశలు పెట్టుకున్నప్పటికీ?.. కేవలం 8 స్థానాల్లో విజయం సాధించింది. ఉత్తర తెలంగాణలోని పలు స్థానాల్లో జెండాను ఎగరవేసింది. ఇక హైదరాబాద్ పరిధిలో మాత్రం రాజాసింగ్ మాత్రమే గెలిచారు. ఇక దక్షిణ తెలంగాణలో డీలా పడిపోయింది.

**6 ఎంపీ సీట్లపై కన్ను?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించిన సీట్లు దక్కకపోయినప్పటికీ? పార్లమెంట్ ఎన్నికలను సవాల్ గా తీసుకుంది బీజేపీ. ఆపరేషన్ ఆకర్ష్ తో బీఆర్ఎస్ కు చెందిన చాలా మంది నేతలను పార్టీలోకి తీసుకుంది. ఇప్పటికే 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. పోటీ చేసే వారిలో కీలకమైన నేతలు ఉన్నారు. గత ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లను గెలవగా? ఈసారి మాత్రం రెండంకెల సంఖ్యను దాటడమే టార్గెట్ గా పెట్టుకుంది. మోదీ మోనియాతో పాటు పలు కీలకమైన ఆంశాలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ ప్రచారం సాగిస్తోంది తెలంగాణలోని బీజేపీ నాయకత్వం. అయితే ఈసారి కొన్ని స్థానాల విషయంలో భారీగా ఆశలు పెట్టుకుంది. ఇక్కడ ఎలాగైనా జెండా ఎగరవేయాలని చూస్తోంది. ఇందులో మాల్కాజ్ గిరి, సికింద్రాబాద్, కరీంనగర్, చేవెళ్ల, నిజామాబాద్, ఆదిలాబాద్, జహీరాబాద్, మహబూబ్ నగర్, భువనగిరి, మెదక్ తో పాటు వరంగల్, చేవెళ్ల స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాల్లో పార్టీకి చెందిన కీలక నేతలు పోటీ చేస్తున్నారు. మల్కాజ్ గిరి నుంచి ఈటల, సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, మెదక్ నుంచి రఘునందన్, నిజామాబాద్ నుంచి అర్వింద్, మహబూబ్ నగర్ నుంచి డీకే అరుణ, కరీంనగర్ నుంచి సంజయ్ ఉన్నారు. చేవెళ్ల నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బరిలో ఉన్నారు. హైదరాబాద్ తో పాటు మిగిలిన స్థానాల్లోనూ బీజేపీ గట్టి ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎలాగైనా ఈ ఎన్నికల్లో పదికి పైగా ఎంపీ స్థానాలను గెలిచి? తెలంగాణలోనూ తిరుగులేని శక్తిగా మారాలని కమలదళం పావులు కదుపుతోంది. ఆ దిశగా గ్రౌండ్ లోనూ కష్టపడుతోంది. త్వరలోనే మోదీతో పాటు ఆ పార్టీ అగ్రనేతలు? ప్రచారానికి రానున్నారు. ఇప్పటికే ఏపీలో కూటమిగా పోటీ చేస్తున్న బీజేపీ? ఈసారి అక్కడ మళ్లీ ఖాతా తెరిచే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా ఆరు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తోంస్థానాల్లో కొన్నింటిని గెలిచే అవకాశం ఉంది. మొత్తంగా ఈసారి సౌత్ లో బీజేపీ బలపడే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే తుది ఫలితాలు ఎలా ఉంటాయనేది చూడాలి?!

**తెలంగాణ బీజేపీ ఎంపీ అభ్యర్థులు :**

ఈటల రాజేందర్– మల్కాజిగిరి
అరవింద్ ధర్మపురి– నిజామాబాద్
బండి సంజయ్– కరీంనగర్
బీబీ పాటిల్– జహీరాబాద్
కిషన్ రెడ్డి– సికింద్రాబాద్
కొండా విశ్వేశ్వర్ రెడ్డి– చేవెళ్ల
మాధవి లత– హైద్రాబాద్
పోతుగంటి భరత్ – నాగర్ కర్నూల్
బూర నర్సయ్య గౌడ్– భువనగిరి
మహబూబ్ నగర్ – డీకే అరుణ
నల్గొండ – సైదిరెడ్డి
ఆదిలాబాద్ – గోడెం నగేశ్
వరంగల్ – ఆరూరి రమేశ్
పెద్దపల్లి – గోమాస శ్రీనివాస్
ఖమ్మం – తాండ్ర వినోద్‌రావు
మహబూబాబాద్ – సీతారామ్ నాయక్

# త్వరలోనే బీజేపీలోకి రేవంత్ రెడ్డి..

## నిజామాబాద్ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలోనే బీజేపీకిలోకి వస్తారని ఆ పార్టీ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డిది ఏబీవీపీ బ్యాక్‌గ్రౌండ్ అని, ఆయన మనసులో హిందుత్వం బలంగా ఉన్నా ఏమీ చేయలేని స్థితిలో నేడు ఉన్నారని చెప్పారు. బీజేపీతో కొట్లాడుతామని చెప్పి బీజేపీలోకే వస్తున్నారని విమర్శించారు. కానీ, బీజేపీతో అంతో ఇంతో కొట్లాడింది కేసీఆర్ ఒక్కరే అని అర్వింద్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్క డా ఇబ్బందులు రాకుండా కరెంటు ఇచ్చానని గొప్పగా చెప్పుకొని ఓట్లడిగే హక్కు ఒక్క కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని స్పష్టం చేశారు. అసలు కాంగ్రెస్‌కు ఒక ఎజెండా అం టూ లేదని, ఆ పార్టీకి ఓట్లడిగే నైతిక హక్కు ఏమాత్రం లేదని విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని విభజించి నాశనం చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు ఆర్టికల్ 370 తీసేస్తం, ట్రిపుల్ తలాక్ తెస్తాం అంటున్నారని దుయ్యబట్టారు. సీఏఏను ఎందుకు విమర్శిస్తున్నారో అర్థంకావడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలో సెక్యులర్ పదం ఎందుకు పెట్టారో చెప్పాలని, ఈ దేశాన్ని 70 ఏండ్లు పాలించి



చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఒక ప్రైవేటు ఇష్యూ అని, దానిపై ఫోకస్ పెట్టడమేంటి అని ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీగా జగిత్యాల జీవన్‌రెడ్డి పోటీ చేస్తున్నారని ఇక్కడి ప్రజలు అనుకోవడం లేదని, ఆర్మూరు జీవన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్నట్టు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

## ఈ నెల 24న ఇంటర్ ఫలితాలు



**హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈ నెల 24న విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ ఏడాది పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు ఒకేసారి వెల్లడించనుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. మార్చి 10 నుంచి ఈ నెల 10 వరకు మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 15 రోజుల ముందుగానే ఫలితాలు ప్రకటించనున్నారు. మార్కుల నమోదులో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో ఓఎంఆర్ షీట్ల డీ కోడింగ్ చేశారు. మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత అన్ని విధాలా పరిశీలన చేశారు. ఎలాంటి సమస్యలు లేకపోవడంతో ఫలితాలను విడుదల చేయనున్నారు.

## ఏపీలో నాకే బిల్లులు రావాలి



-మొదటి పేజి తరువాయి

అభ్యర్థులకు డబ్బులు పంపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని జర్నలిస్టు అడిగారు. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్.. ఏ పార్టీకి తాను డబ్బులు ఇవ్వడంలేదన్నారు. తనవద్ద డబ్బుల్లేవని, తానే కష్టాల్లో ఉన్నానని చెప్పారు. ఏపీ నుంచి తనకు చాలా బిల్లులు రావాల్సి ఉందన్నారు. తాను కష్టాల్లో ఉంటే డబ్బులు ఎలా ఇస్తానని ప్రశ్నించారు. సొంత పార్టీ కాంగ్రెస్‌కు మద్దతిస్తారా? తెలంగాణ ఎన్నికల్లో సపోర్ట్ చేసినందుకు టీడీపీకి మద్దతిస్తారా? సన్నిహితంగా ఉండే జగన్ కు మద్దతిస్తారా? అని అడగ్గా కాంగ్రెస్ పార్టీ తనదని, ఆ పార్టీకే మద్దతిస్తానన్నారు. రాజకీయాలు, స్నేహాలు, బంధుత్వాలు వేరువేరని, ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. వృత్తి రీత్యా కాంట్రాక్టర్ అయిన పొంగులేటి వైసీపీ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ లో చేరి, అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా కొనసాగుతున్నారు. ఏపీ సీఎం జగన్ తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఎక్కువ.

## మెజారిటీ లోక్‌సభ స్థానాలపై ఫోకస్

-మొదటి పేజి తరువాయి



పార్లమెంటు స్థానానికి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు .తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రథసారథిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన అస్తిత్వాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీని ముందు వరుసలోకి తీసుకువచ్చి గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేలా చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పార్టీని ఏకతాటి మీద ముందుకు నడిపించడానికి ప్రయత్నం చేస్తున్నారు.

**అతడే ఒక సైన్యంగా..**

పార్లమెంట్ ఎన్నికలకు తాజాగా రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికలలో అతడే ఒక సైన్యంగా తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి కమాండర్‌గా ఎన్నికల ప్రహసనాన్ని ముందుకు నడిపించనున్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలలో గెలవాలని, కేంద్రంలో అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలో ఉన్న క్రమంలో మెజారిటీ లోక్‌సభ స్థానాలపై ఫోకస్ పెట్టింది. ఇక ఈ బాధ్యతను కూడా రేవంత్ రెడ్డికి అప్పగించి రంగంలోకి దింపింది కాంగ్రెస్ హైకమాండ్ . సుడిగాలి పర్యటనల ప్లాన్ లో రేవంత్ రెడ్డి తెలంగాణలో ఉన్న మొత్తం 17 లోక్‌సభ స్థానాలలో 15 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డి మరో మారు ప్రచార పర్వంలో దూసుకుపోనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం నియోజకవర్గాల వారీగా సుడిగాలి పర్యటనకు రెడీ అయిన రేవంత్ రెడ్డి తనపై, కాంగ్రెస్ పార్టీపై ప్రజల ఆదరణను మరో మారు చూపాలని విజ్ఞప్తి చేయనున్నారు.

**కాంగ్రెస్ కు ఆయనే స్టార్ పొలిటీషియన్**

కార్యకర్తల్లో జోష్ నింపి పార్టీ కోసం పనిచేసేలా చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలో ప్రజల మద్దతును కూడగట్టడం కోసం రేవంత్ రెడ్డి తనదైన పంథాలో ప్రచార పర్వాన్ని కొనసాగించనున్నారు. స్టార్ పొలిటీషియన్ గా, తెలంగాణ కాంగ్రెస్ కమాండర్ గా ఆయన మళ్ళీ దూకుడు చూపించనున్నారు.

## అక్కడ 11 చోట్ల రీపోలింగ్.. కారణం ఇదే

**ఇంఫాల్:** మొదటి దశ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 19న మొత్తం 21 రాష్ట్రాల్లో 102 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. అయితే మణిపూర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 11 చోట్ల హింసాత్మక వాతావరణం చోటు చేసుకోవడం వల్ల, అక్కడ రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న మొత్తం 11 ప్రాంతాల్లో ఏప్రిల్ 22న (సోమవారం) ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ రీపోలింగ్ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. "ఖురాయ్ నియోజకవర్గంలోని మొయిరంగ్‌కంపు సాజేబ్, తొంగమ్ లైకై, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని క్షేత్రీగావ్‌లో నాలుగు, థోంగ్జులో ఒకటి, ఉరిపోక్‌లో మూడు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కొంతౌజామ్‌లో ఒకటి".. ఇలా మొత్తం 11 ప్రాంతాల్లో రీపోలింగ్ జరగనుంది. పోలింగ్ బూత్‌ల వద్ద కాల్పులు, బెదిరింపులు, ఈవీఎంలను ధ్వంసం చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ కారణంగానే రీపోలింగ్ జరపనున్నట్లు పేర్కొన్నారు.

## సంపాదకీయం

# సాగు నేలలు బీడులుగా మారుతున్నాయా!

1960ల్లో నార్మన్ బోర్లాగ్ నాయకత్వంలో వచ్చిన హరిత విప్లవంతో వరి, గోధుమ లాంటి పొట్టి పంటలను ఏళ్ల తరబడి సాగుచేయడంతో నేలలు నిస్సారమై ఎడారీకరణకు బీజాలు పడ్డాయి. 1970ల్లో వచ్చిన స్వల్పకాలిక వరి వంగడాల సాగుతో దిగుబడులు పెరిగినా, నాణానికి మరో వైపున సారవంతమైన వ్యవసాయ నేలలు క్రమంగా నిస్సారమైన ఎడారులుగా మారే ప్రమాదపు అంచున ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీ, పంజాబ్, బీహార్, పశ్చిమ బెంగాల్ లాంటి గంగా పరివాహక ప్రాంతాల్లో 5 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ క్షేత్రాలు ఎడారీకరణకు చేరువలో ఉన్నాయని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. భూవాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులకు తోడుగా పర్యావరణ విచ్ఛిన్నతల నేపథ్యంలో భూగోళ నివాసయోగ్యత కాపాడడానికి 1970 నుంచి ప్రతి ఏట 22 ఏప్రిల్‌న ఐరాస సభ్యదేశాలు "ప్రపంచ ధరిత్రి దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది ప్రపంచ ధరిత్రి దినం-2024 నినాదంగా "ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ (భూగ్రహానికి వ్యతిరేకంగా గరళ ప్లాస్టిక్)" అనే అంశాన్ని తీసుకొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేలకు చేరి జీవ విచ్ఛిన్నం కాకుండా వందల ఏండ్లు మట్టిలోనే ఉంటూ నేల నాణ్యతను తగ్గించడం జరుగుతున్నది. పట్టణాలు, మహానగరాల పరిసరాలు ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలతో చుట్టుముట్టబడుతున్నాయి. నేల ఎడారీకరణకు ఊతం ఇస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, సింగిల్ యూజ్ ప్లస్టిక్ వాడకాన్ని కట్టడి చేస్తూ భూమాత ఒడిని కాలుష్య రహిత పవిత్ర క్షేత్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలి. భూగోళంపై ఉన్న నేలలో 40 శాతం వరకు నీటి వసతులు లేని బీడు భూములే (డ్రై లాండ్స్) ఉన్నాయని, ఈ భూముల్లో 2 బిలియన్ల ప్రజలు జీవిస్తున్నారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 12 మిలియన్ ఘనపు కిలోమీటర్ల శుష్క భూములు (అరీడ్ లాండ్స్) ఎడారీకరణకు లోనైనాయని, దాదాపు 20 శాతం బీడు భూములు క్షీణత(డీగ్రెడేషన్)కు గురి అయ్యాయని గణాంకాలు వివరిస్తున్నాయి. భూగోళంపై ఉన్న 20 శాతం నేలల్లో సగం వరకు ఎడారీకరణ ప్రమాదపు అంచున ఉన్నాయని, ప్రతి ఏటా 12 మిలియన్ హెక్టార్ల సారవంతమైన నేల ఎడారీకరణ ఉచ్చులో పడుతున్నదని తేలింది. ఈ అవాంఛనీయ సంక్షోభ ఫలితంగా 3 బిలియన్ల ప్రజలు ఆహార కొరతతో పేదరికంలోకి నెట్టబడడం జరుగుతున్నది. ఈ దుష్పరిణామాల వల్ల ఒక బిలియన్ ప్రజల ఆకలి చావులు పెరుగుతాయని పేర్కొనబడింది. సహజ విపత్తులు లేదా మానవ కృత్రిమ కార్యాల వల్ల సారవంతమైన నేల నిర్వీర్యం, నిస్సారం కావడాన్ని ఎడారీకరణగా పేర్కొంటారు. ఈ నేలలకు పోషకాలను అందిస్తూ, వెంటనే సారాన్ని అందించని యెడల వ్యవసాయ యోగ్యతను కోల్పోయి, వ్యవసాయ వినియోగానికి పనికి రాకుండా శుష్క భూములుగా మారిపోతాయని గమనించాలి. సకాలంలో స్పందించని యెడల కొంత కాలానికి నేల నాణ్యత నశించి, క్రమంగా వ్యవసాయ దిగుబడులు పూర్తిగా తగ్గి, శాశ్వితంగా కోలుకోలేని దుస్థితికి చేరుతూ ఎడారులను తలపిస్తాయి. నేలను అత్యాశతో సాగుకు వాడితే పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, జీవ వైవిధ్య వినాశనం, అంటువ్యాధులు ప్రబలడం జరుగుతాయి. దీని పర్యవసానంగా నీటి కొరత, జీవన భృతి, ప్రకృతి విపత్తులు కూడా చూడవచ్చు. వెంటనే మానవ సమాజం మేల్కొని ఎడారీకరణకు అడ్డుకట్టవేయని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తి పడిపోయి, 30 శాతం ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం, పేదరికం పెరగడం జరిగి, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం వీలుకాని దుస్థితి వస్తుందని గమనించాలి. 2030 వరకు 350 మిలియన్ హెక్టార్ల నిస్సార ఎడారి భూముల నాణ్యతను పునర్ ప్రతిష్టాపన చేయడంతో దాదాపు 26 గీగా టన్నుల గ్రీన్‌హౌజ్ వాయువులు వాతావరణలోంచి తొలగించబడుతాయని అంచనా వేస్తున్నారు. ఎడారీరకణను కట్టడి చేయడంతో వ్యవసాయ ఉపాధులు, అనుబంధ పరిశ్రమలు, పోషకాహార లభ్యత, నీటి లభ్యత, జీవ వైవిధ్య పరిరక్షణ పెరిగి వాతావరణంలో సకారాత్మక మార్పులకు పునాది పడుతుంది. కృత్రిమ ఎరువులు అధికంగా వాడడం , విచక్షణారహిత రసాయనాల వాడకం, అధిక నీటి వినియోగంతో దిగుబడులు పెరిగి ఆహార భద్రత సుసాధ్యమైనప్పటికీ ఏకకాలంలో ఎడారీకరణ కూడా పెరగడం విచారకరం. నేలలోని సారాన్ని అనేక ఏండ్లుగా దురాశతో లాగుతూ, దిగుబడులను పెంచుకునే ప్రయత్నాలలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడంతో నేలలోని హిత సూక్ష్మజీవులు, ఇతర జీవులు నశించడంతో సారవంతమైన నేలలు క్రమంగా నిస్సారమై ఎడారీకరణకు చేరువ కావడం చూస్తుండగానే జరిగిపోయింది. నేల ఎడారీకరణ, నేల కోత, నేల నాణ్యతలో క్షీణతలు కాలక్రమంలో జరగడం వాస్తవ అనుభవంగా గుర్తిస్తున్నాం. అడవుల నరికి వేత, పచ్చిక బయళ్లు / చెట్టు చేమల్ని తొలగించడం, పశుగ్రాస వినియోగం, వ్యవసాయ క్షేత్రాల విస్తరణ, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ లాంటి మానవ ఆధునిక క్రియలు ఎడారీకరణను అనేక రెట్లు పెంచడం జరిగింది. అత్యాధునిక యంత్రాల వినియోగం, ఒకే రకమైన పంటలు వేయడం, నేల నాణ్యతను అతిగా పీల్చడం, నేల కాలుష్యం లాంటి కారణాలతో నాణ్యమైన నేలలు నిస్సారమై ఎడారులను తలపించుట ప్రారంభమైంది. ఆహార వ్యర్థాలను తగ్గించడంతో పాటు పంట మార్పిడి పద్దతులు, పరిమిత పట్టణీకరణ, విచక్షణాయుత ఎరువులు/ పురుగు మందులు వాడకం లాంటి అనేక చర్యలు ఎడారీకరణను అడ్డుకుంటాయి. సారవంతమైన నేలలు మానవాళి ఉనికికి ప్రతిరూపాలని తెలుసుకొంటూ, గ్రీన్‌హౌజ్ వాయువులను నియంత్రిణ చేయడమే కాకుండా మొక్కలు, జంతువులు మరియు మానవాళిని సుసంపన్నం చేయడానికి ఎడారీకరణకు ఆనకట్ట వేయబడుతుంది. మానవ కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడులను అందించుటలో సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయని, నేల సారాన్ని కాపాడడమంటే జీవన ప్రమాణాలను పెంచుకోవడమే అని భావిద్దాం. నాణ్యమైన మట్టి సువాసనను ఆశ్విర్వాదిస్తూ, పిడికిళ్లోకి తీసుకొని ముద్దాడుదాం.

# దోషాలను హరించే ప్రదోషవ్రతం

ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్థనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు. ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం.

ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియల లోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశి నాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా "అర్థనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం.



ప్రదోష సమయంలో శివుడు అర్థనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు. ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు. ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు.

దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి. త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్....మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి.... 108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

# సత్యాహింసల మార్గదర్శి

వేద యుగంలో పెరిగిన జీవహింస, ఖర్చుతో కూడిన యజ్ఞ యాగాలు, క్రతువులు, సమాజంలో పేరుకు పోయిన వర్ణ వివక్ష, మత వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు ఆలోచనా పరులైన కొద్దిమందిలో జిజ్ఞాసను రేకెత్తించాయి. వీటిని అధిగమించడానికి అజీవకులు, చార్వాకులు, జైన, బౌద్ధ మత కర్తలైన... మహావీరుడు, బుద్ధుడు వంటివారు క్రీ.పూ 6వ శతాబ్దంలో భావవికాసానికి నాంది పలికారు. జైన మతాన్ని అనుసరించేవారు జైనులు. జినులు అంటే కోరికలను జయించి వారు అని అర్థం. జైన మతాన్ని వృషభ నాథుడు స్థాపించగా, ఇది 'జిన' (విజేత) అనే పదం నుంచి వచ్చింది. జైన మత గురువులను తీర్థంకరులని పిలుస్తారు. తీర్థంకరులంటే పూర్ణ పురుషులు. జీవన ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించినవారు. జైనమతంలో తొలి తీర్థంకరుడు వృషభ నాథుడు కాగా, ఆయన గురించి ఋగ్వేదంలో పేర్కొన బడింది. అంతే కాదు విష్ణు పురాణం, భాగవత పురాణంలో నారాయణావతారంగా కీర్తించ బడ్డాడు. దీనిని బట్టి జైన మతం ఋగ్వేద మతం అంతటి ప్రాచీనమైంది. ఇక, చిట్ట చివరి ఇరవై నాలుగో తీర్థంకరుడు వర్థమాన మహావీరుడని జైనుల విశ్వాసం. బీహార్ లో వైశాలికి సమీపములో కుండ గ్రామంలో క్రీ.పూ. 599 లో (అధిక సంఖ్యాకుల విశ్వాసం) క్షత్రియ కుటుంబములో సిద్ధార్థ మహారాజుకు, రాణి త్రిషలకు జన్మించిన మహావీరుడికి తల్లి దండ్రులు పెట్టిన పేరు వర్ధ మానుడు. కొందరు జైనులు మాత్రం మహావీరుడు క్రీస్తు పూర్వం 599లో జన్మించాడని నమ్ముతుండగా, మరి కొందరు క్రీస్తు పూర్వం 615లో జన్మించాడని భావిస్తున్నారు. అయితే ఇందులో దేనికీ స్పష్టమైన ఆధారాలు లేవు.

హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసం 13వ రోజున అంటే చైత్ర శుక్ల త్రయోదశి రోజున మహావీరుడు జన్మించారు. అల్లారు ముద్దుగా పెరిగిన మహావీరుడు తల్లి దండ్రులు 28 వ ఏట మరణిం చారు. యశోధరను వివాహమాడి, ఓ కుమార్తెకు జన్మనిచ్చిన తరువాత తన రాజ్యాన్ని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన మహావీరుడు అకస్మాత్తుగా తన సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచి పెట్టి సత్యాన్వేషణ కోసం స్వయం గా బయలు దేరాడు. తన 30వ ఏట గృహస్థ్యాన్ని త్యజించి, ఆరు సంవత్సరాలు మక్కలి గోశాలుని శిష్యునిగా ఉన్నాడు. 36 వ ఏట సన్యాసాన్ని స్వీకరించి, వర్ధమాను డు ఆ తరువాత రిజుపాలిక నదీ తీరంలోని జృంబిక గ్రామం దగ్గర కఠోర తపస్సు చేశాడు. తన 43వ ఏట సాలవృక్షం కింద వైశాఖ మాసం పదమూడో రోజున జృంభిక గ్రామంలో జానోదయం కలిగింది. తద్వారా తపోసిద్ధిని పొందాడు. తదనంతరం... వర్ధమానుడు అంగ, మిథిల, కోసల, మగధదేశాలలో తన తత్వాన్ని ప్రచారం



చేశాడు. అప్పటి కే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహా వీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధిం చిన వివరాలు వెలుగు చూశాయి. 32ఏళ్ళ పాటు అహింసా ధర్మము తో ప్రచారం జరిపిన మహావీరుడు తన 72వ ఏట క్రీ.పూ.527లో పావాపురిలో దేహాన్ని త్యజించాడు. మహావీరుని బోధనలు: 1. వైదిక కర్మలు చేయడం, దేవుణ్ని వేడు కోవడం వల్ల మనిషికి ఉపయోగం లేదు. 2. చెడు చేయకుండా మంచి జీవితాన్ని గడపడమే మోక్ష మార్గం. 3. జైనమత ప్రకారం 'ఆత్మ' ప్రాణులకే కాదు, ప్రతి వస్తువులోను ఉంటుంది. దేవుడితో నిమిత్తం లేదు. 4. సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చరిత్ర- మోక్ష మార్గాలు.

వీటిని 'త్రిరత్నాలు' అంటారు. (సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, సరైన నడవడి) 5. పార్శ్వ నాథుడు ప్రతిపాదించిన సత్య, అహింస, అపరిగ్రహ, అనస్తేయ అనే నాలుగు మూల సూత్రాలకు మహావీరుడు బ్రహ్మచర్య సూత్రాన్ని అదనంగా జోడించాడు. వీటిని 'పంచానువ్రత' అని పిలుస్తారు. పార్శ్వనాథుడు శ్వేతాంబర వాదాన్ని, మహావీరుడు దిగంబర వాదాన్ని సమర్థించారు. మహావీరుని అనుచరులను నిగ్రంథులు అంటారు (బంధాల నుంచి విముక్తి పొందిన వారు). జైనులు పూజించే స్త్రీ దేవతను 'విద్యాదేవి' అని పిలుస్తారు. జైన మతంలో సల్లేఖనం (శరీరాన్ని క్షీణించుకొని మరణించడం) ద్వారా పరమపదం చేరుకోవడం ఆచారం. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖనం ద్వారా పరమపదించాడు. భారతీయ వాస్తు - శిల్ప కళాభివృద్ధికి జైనమతం గొప్ప సేవ చేసింది. మహావీరుడు సాధారణంగా కూర్చొని లేదా నిలబడి ధ్యాన భంగిమలో, అతని క్రింద ఉన్న సింహం చిహ్నంగా చిత్రీకరించ బడింది. ఉత్తర భారతదేశం లోని మధురలోని పురావస్తు ప్రాంతాల నుండి అతని మొట్టమొదటి విగ్రహాన్ని క్రీ.పూ 1వ శతాబ్దం నుండి క్రీ. శ. 2వ శతాబ్దంకి చెందినది. అయన పుట్టిన రోజును మహావీర్ జయంతిగా జరుపు కుంటారు. ఆయన మోక్షంను జైనులు దీపావళిగా గుర్తించారు. చిన్న వయసులోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సత్యం, అహింస, ప్రేమ మార్గాన్ని చూపించిన మహావీరుని జయంతి సందర్భంగా జైన మతానికి చెందిన వారు వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటారు. మహావీరుని ఊరేగింపు కూడా నిర్వహిస్తారు. దీని ద్వారా మహావీరుని సందేశాన్ని తెలియ జేయడానికి ప్రయత్నిస్తారు.

# మానవత్వం చాటుకున్నా గిత్తే మధన్



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని మార్కాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసి నిరుపేద ఆడబిడ్డ పెళ్లి కోసం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించి మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త గిత్తే మధన్ మానవత్వాన్ని చాటుకున్నారు. పెళ్లికూతురు సురేఖ తల్లి చనిపోగా తండ్రి అనారోగ్యంతో ఉన్నాడు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న గిత్త మదన్ వివాహ ఖర్చులకు మానవత్వం దృక్పథంతో నిరుపేదలకు ప్రతినెల సహాయం చేయడం జరుగుతుందన్నారు.

# వినోద్ కుమార్ గళం.. కరీంనగర్‌కు బలం : కేటీఆర్



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్ గళం కరీంనగర్‌కు బలమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఆయన ఒక పోస్టు పెట్టారు. బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో వినోద్‌కుమార్ చురుకైన పాత్ర పోషించారని కేటీఆర్ కొనియాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డ వినోద్ కుమార్.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరని పేర్కొన్నారు. 2004లో ఎంపీగా గెలిచిన తర్వాత పార్లమెంట్‌లో 32 పార్టీలు తెలంగాణకు అనుకూలంగా లేఖలు ఇవ్వడంలో వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

# పాతబస్తీలో ఒవైసీ బ్రదర్స్ ఆటలు సాగనివ్వను...

**- హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత**



**హైదరాబాద్:** పాతబస్తీలో ఇప్పటి నుంచి ఒవైసీ బ్రదర్స్ చట్టవ్యతిరేక ఆటలు సాగనివ్వనని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత హెచ్చరించారు. ఆదివారం ఐఎస్?సదన్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనార్టీలకు ఒవైసీ చేసిన న్యాయం ఏమిలేదని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఈ సారి హైదరాబాద్ కోటను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నేతలు మన్నె శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**సెక్యూరిటీ సిబ్బంది అత్యుత్సాహం**

వినయ్‌నగర్ విజయ వినాయక ఆలయంలో ఎంపీ అభ్యర్థి మాధవీ లత ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి సెక్యూరిటీ సిబ్బంది నెట్టివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నాయకులు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మాధవీలత జోక్యం చేసుకుని సర్ధి చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# జోగిపేట పట్టణంలో సెల్ టవర్ ఎక్కి సైకో హల్చల్...



**సంగారెడ్డి జిల్లా:** జోగిపేట పట్టణంలో ఓ సైకో సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేశాడు. శేఖర్ అనే బాలుడిని హత్య చేశానని చెబుతూ నాగరాజు అనే సైకో హల్ చల్ చేశాడు. శేఖర్ అనే బాలుడు పని చేస్తున్న ఓ స్క్రాప్ దుకాణంలో నాగరాజు రాగితీగ దొంగతనం చేశాడు. ఆ విషయాన్ని శేఖర్ తన యజమానికి చెప్పడంతో శేఖర్‌పై నాగరాజు పగ పెంచుకున్నాడు. నిన్న రాత్రి శేఖర్ అనే బాలున్ని చంపానని చెప్పి కత్తి వెంటపెట్టుకొని నాగరాజు సెల్‌పోన్ టవర్ ఎక్కాడు. కిందికి దించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కత్తితో దాడి చేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నాగరాజును కిందికి దింపేందుకు యత్నించారు. హత్య చేశానని చెబుతున్న శేఖర్ ఆచూకీ ఇంకా దొరకలేదు. దీంతో శేఖర్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ఎంపీగా కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి



**వాస్తవ నేస్తం,కోదాడ:** బీఆర్ఎస్ కార్యాలయంలో మోతే నడిగూడెం మునగాల ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. వంద రోజుల్లోనే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు.. ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలో అగ్రస్థానంగా నిలిపిన పరిస్థితులను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకటిఆర్ఎస్ నాయకుల పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు.. ఇప్పటికే రాష్ట్రంలో సాగు తాగునీరు అందించలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ఎత్తివేసిందని విమర్శించారు.. చిన్న చిన్న మనస్పర్ధలను తొలగించుకుని నైరాశ్యాన్ని వీడి పార్టీకి పూర్వ వైభవం తెచ్చే బాధ్యత నాయకులదేనన్నారు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ఈనెల 23 సాయంత్రంమోతే నడిగూడెం మునగాల మండలాలలో పార్టీ పార్లమెంటు అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి సభలను విజయవంతం చేసేందుకు నాయకులు సన్నద్ధం కావాలన్నారు.. మండల కేంద్రాలలో నిర్వహించే ఈ సమావేశాలకు 5వేలకు పైగా శ్రేణులు పాల్గొనే విధంగా కృషి చేయాలన్నారు... నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు వెన్నంటి ఉంటానని అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు ఈ సమావేశంలో ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు శీలం సైదులు, తొగరు రమేషు, పల్లా నర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్లు కందిబండ సత్య నారాయణ, రామ్ రెడ్డి, సీతారాములు, మండల నాయకులు ఏలూరు వెంకటేశ్వరరావు, ఎలక వెంకట్ రెడ్డి, అనంతల ఆంజనేయులు, వట్టికుటి చంద్రయ్య, నాగిరెడ్డి, ఉడుం కృష్ణ, పల్సు మన్సూర్, మీక్కిలినేని సతీష్ , ఇంద్ర శేఖర్ రెడ్డి, కొండా వెంకన్న,నలమద నారాయణరావు, దున్న సుధాకర్, రాంబాబు గౌడ్, వీరయ్య, జగ్గయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ పోటీ పరీక్షల్లో ర్యాంకు సాధించిన సాయి అలేఖ్య కు ఘన సన్మానం






**ఘనంగా స్వాగతం పలికిన గోవిందపురం గ్రామస్తులు**

**వాస్తవ నేస్తం,బోనకల్:** 2023 యూపీఎస్సీ పోటీ పరీక్షల్లో 938వ ర్యాంకు సాధించిన సందర్భంగా రావూరి ప్రకాష్ రావు కుమార్తె కు గోవిందపురం ఎల్ గ్రామంలో ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఐజి చౌటూరి వెంకటేశ్వరరావు సాయి అలేఖ్యకు ఘనంగా పూలమాలలు వేసి అభినందించారు మహిళలు హారతులతో స్వాగతం తెలిపారు ఒడ్డు మీద నుంచి గ్రామ ప్రజల సమక్షంలో పెద్ద ఎత్తున కులాల మతాల పార్టీలకు అతీతంగా డప్పు వాయిద్యాలతో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఏర్పాటుచేసిన సన్మాన సభ కార్యక్రమం వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు సన్మాన సభలో పాల్గొన్న ముఖ్య అతిథి చౌటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. సాయి అలేఖ్య వారు కుటుంబం నిరుపేద కుటుంబమైన రావూరి వెంకటరామయ్య కుమారులు వారి నాన్న స్ఫూర్తితో మంచి స్థాయిలో ఉన్నారని వారి తాత రావూరి వెంకటరామయ్య ను స్ఫూర్తి తీసుకొని చదవాలి ఎదగాలి అనే స్ఫూర్తితో సాయి అలేఖ్య గోవిందపురం ఎల్ గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని వారి అమ్మానాన్న పెదనాన్న బాబాయ్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో అలేఖ్య ఈ స్థాయికి ఎదిగిందని సాయి అలేఖ్యను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ మంచిగా కష్టపడి చదవాలని సాయి అలేఖ్య ఎన్నో ఉన్నత పదవులు పొందాలని కోరారు. అనంతరం సాయి అలేఖ్యను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా దామస్వరూప మాట్లాడుతూ. సాయి అలేఖ్య మా స్టూడెంట్ గా ఉన్నప్పుడు అలేఖ్యను మంచిగా చదవాలని ప్రోత్సహించే వారిని అలేఖ్య నువ్వు ఐపీఎస్ లేదా ఐఏఎస్ కావాలని మంచి ర్యాంకు రావాలని సలహా సూచనలు ఇచ్చేవారని నేను ఆనాడు అన్న మాటలు అలేఖ్య తన గోల్ నెరవేర్చిందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య మాజీ సొసైటీ సీఈవో ఏడునూతుల లక్ష్మణరావు ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత మాజీ సర్పంచ్ ఉమ్మనీని బాబు కళ్యాణపు నాగేశ్వరరావు మాజీ గ్రామ సర్పంచ్ పెద్దలు మాదినేని నారాయణ లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు ఐలూ రాష్ట్ర నాయకులు ఏడునూతల శ్రీనివా సరావు ఉమ్మనేని కోటయ్య రావూరి వారి కుటుంబ సభ్యులు రావూరి రాజు రావూరి ప్రకాష్ రావూరి అశోక్ కానిస్టేబు ల్కానిస్టేబుల్ షేక్ అమీర్ కలిశా సైదయ్య ప్రభాకర్ వెంకటేశ్వరావు మున్నా శైలజ సైదులు తదితరులు, గ్రామ స్తులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని అభినందించారు.

# రెఫరెండం అన్నోళ్లు రైతుల దగ్గరికి ఎందుకు పోరు?

- నేనొక రైతుబిడ్డగా చెప్తున్నా..
- రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణణాతీతం
- తెలంగాణకు ఈ ఎన్నికలు చరిత్రాత్మకం
- కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ ప్రయోజనాలు పట్టవు
- 10 ఏండ్ల ఆ పార్టీల వైఖరే నిదర్శనం
- తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది బీఆర్ఎస్ ఒక్కటే
- కేసీఆర్‌పై ప్రజల్లో ఆదరణ పెరిగింది



**హైదరాబాద్ :** 'ఈ ఎన్నికలను రెఫరెండంగా స్వీకరించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉంటే.. రైతుల కన్నీటిని ఎందుకు తుడవడం లేదు.. వారి బాధను ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని ప్రశ్నించారు బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ప్రస్తుత ఖమ్మం పార్లమెంట్ స్థానం అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు.. 'నేనొక రైతుబిడ్డగా చెప్తున్నా.. రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణణాతీతం'అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, పరిరక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవితను నిర్దేశించేవిగా అభివర్ణించారు. రాష్ట్రం నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు, వీరిలో ఒకరు కేంద్ర మంత్రిగా చేసినా, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలున్నా తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే ఇప్పుడింకా ప్రజల్లో ఆయనపై ఆదరాభిమానాలు పెరిగాయన్న ఆయన, ఎన్నికల ప్రచార సరళి, స్పందన తదితర అంశాలపై 'నమస్తే తెలంగాణ'కు శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

దాదాపు 25 రోజులుగా మా పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇప్పటివరకు 23 మండలాలను కవర్ చేశా. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులంతా తమ సమస్యలు చెబుతూ బాధపడుతున్నారు. రైతుబంధు ఇంకా అందరికీ రాలేదు. మాకు మేం చెప్పుకోవద్దు కానీ రైతుల్లో కేసీఆర్‌పై ఆదరణ, అభిమానం వారు సీఎంగా ఉన్నదానికంటే ఇప్పుడింకా పెరిగింది. 'పదేండ్లపాటు మాకు ఏ కష్టం రాకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఠంచనుగా రైతుబంధు వచ్చింది. పంట కొనుగోలు చేసి వారం తిరక్కముందే మా ఖాతాల్లో డబ్బులు పడేవి. ఇప్పుడా పరిస్థితి లేదు' అని రైతులు గుర్తుచేస్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీ రైతుబంధు రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతాం, రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం, క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని మాయమాటలు చెప్పి మమ్మల్ని మోసం చేసింది' అని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రైతులే కాదు, మహిళలకు నెలకు రూ. 2500 చెల్లిస్తామని, పింఛన్లు రూ.4వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని కోపంతో ఉన్నారు. 'ప్రజల్లో మేం ముఖం చూపకుండా అయింది' అని కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అంటున్నారు.

ఎలాంటి ప్రభావం లేదు. పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. కష్టపడే కార్యకర్తలు మా పార్టీలో ఉన్నారు. నాకన్నా ఎక్కువ కష్టపడి సమన్వయంతో పనిచేస్తున్నారు.ఒక ఎమ్మెల్యే పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలు, ప్రజలు మారరని గత అనుభవాలు చెబుతున్నాయి. రైతుల కష్టాలు, ప్రభుత్వంపై వ్యతిరేకతను చూసి అనవసరంగా పార్టీ మారాననే భావన వారిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఆ ఎమ్మెల్యే సెగ్మెంట్ నా లోక్‌సభ పరిధిలోకి రాదు. అక్కడా ఆ ప్రభావం పెద్దగా ఉంటుందని నేను అనుకోను.

అదంతా పచ్చి అబద్ధం. ఆ రెండు పార్టీల దగాకోరు మాటలకు నిదర్శనం. నలుగురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలతో రాష్ట్రానికి జరిగిన ప్రయోజనం ఏమిటో చెప్పమనండి. ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని మేం పార్లమెంట్ లోపలా బయటా అందోళన చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఏమీ పట్టనట్టు వ్యవహరించారు. ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని మేం పట్టుబడితే మమ్మల్ని చూసి వెకిలిగా నవ్వారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యం. నేను ఇద్దరు ఎంపీలతో కేసీఆర్ రాష్ట్రాన్నే సాధించారు. తొమ్మిది మంది ఎంపీలతో లోక్‌సభనే స్తంభింపజేసి రాష్ట్ర ప్రయోజనాలకు రక్షణగా నిలిచాం. ఇప్పుడు అంతకన్నా ఎక్కువ స్థానాలు గెలవాల్సిన అవసరం ఉన్నది. గెలిచే అవకాశాలూ ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీది మేకపోతు గాంభీర్యం. నాలుగునెలల క్రితం ఇంతకన్నా మెరుగ్గా ఉంటుందని ప్రజలు భావించారు. కానీ, అంతలోనే ఇంత అధ్వానంగా కూరుకుపోతామని ప్రజలెవరూ అనుకోలేదు. ఏదో అనుకుంటే ఇంకేదో అయిందని బాధపడుతున్నారు. బంగారం లాంటి కేసీఆర్ పాలనను కాదని ఇప్పుడు బాధపడుతున్నామనే భావన అన్ని వర్గాల్లో కనిపిస్తున్నది. నిజానికి రెఫరెండంగా స్వీకరించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉంటే రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా పట్టించుకోరా? డిసెంబర్ 9 నుంచే రైతు భరోసా అమలు చేస్తామని చెప్పి 100 రోజులు పూర్తయినా చేయరా? రూ. 2 లక్షల రుణమాఫీకి రైతులు గడువు ఆడిగారా?

# పిడుగులు ఎందుకు పడతాయి?

వర్షం కురుస్తున్నప్పుడు లేదా కురువడానికి ముందు ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. ఈ సందర్భంలో కొన్నిసార్లు పిడుగులు పడుతుంటాయి. ప్రతీ సంవత్సరం పిడుగు పాటు కారణంగా మన దేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్నిసార్లు ఆస్తి నష్టం వాటిల్లుతోంది. అయితే అసలు పిడుగు అంటే ఏమిటి? ఎందుకు పడుతుంది? దాని నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి? తదితర విషయాలు తెలుసుకుందాం. ఎండలు, అధిక ఉష్ణోగ్రతలవల్ల నీరు ఆవిరిగా మారుతుందన్న విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో భాగంగానే ఆకాశంలో సుమారు 25 వేల అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. ఈ సందర్భంలో పైనుంచి సూర్యరశ్మి అధిక ప్రభావం కారణంగా తక్కువ బరువు ఉన్న ధనావేశిత (ం)మేఘాలు పైకి వెళ్తాయి. అదే సందర్భంలో అధిక బరువు ఉండే, దట్టమైన రుణావేశిత మేఘాలు (వీటిలో ఎలక్ట్రాన్లు అధికంగా) కిందికి వస్తాయి. సైన్స్ ప్రకారం ఇలా వచ్చిన రుణావేశిత మేఘాలలోని ఎలక్ట్రాన్లు దగ్గరలోని ధనావేశిత మేఘాలవైపు ఆకర్షించబడతాయి.

కాగా ధనావేశిత మేఘాలు ఎత్తుగా వెళ్లినప్పుడు సమీపంలో మరే వస్తువు ఉన్నా, మనుషులు ఉన్నా అటువైపు ఎలక్ట్రాన్లు వేగంగా ప్రయాణిస్తాయి. ఈ సందర్భంలోనే మేఘాల నుంచి ఒక్కసారిగా ఎలక్ట్రాన్లు రిలీజై విద్యుత్ క్షేత్రంగా మారి భూమి మీదకు వేగంగా దూసుకొస్తాయి. దీనిని పడుగుపాటు లేదా పిడుగు పడటం అంటారు. అలాగే మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు రిలీజ్ అవుతున్న సందర్భంలోనే ఉరుములు, మెరుపులు కూడా పుడతాయి. ఏప్రిల్ చివరలో, మే నెలలో కురిసే అకాల వర్షాల సందర్భంలో పిడుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రజలు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతున్నప్పుడు సురక్షిత ప్రదేశాల్లో, ఇండ్లల్లో ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పొలాల్లో పనిచేసే వారు చెట్ల కింద ఉండకుండా గుడిసెల్లోకి, అడవుల్లో సంచరించేవారు రాతి గుహలు, ఇతర సురక్షిత ప్రదేశాల్లోకి వెళ్లడం ద్వారా తప్పించుకోవచ్చు. గ్రామాలు, నగరాల్లో నివసించేవారు కూడా చెట్లు, సెల్‌ఫోన్ టవర్ల కింద ఉండకుండా జాగ్రత్త పడాలి. ఇక ఉరుములు, మెరుపుల సమయంలో సెల్‌ఫోన్లు వాడటం, మాట్లాడటం, ఎఫ్ఎం రేడియోలో పాటలు వినడం వంటివి చేయకూడదు. ఇతర ఏ ఎలక్ట్రానిక్ డివైసెస్ కూడా యూజ్ చేయకూడదు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో సురక్షిత ప్రదేశంలో లేనివాళ్లు ఉరుములు, మెరుపులు వస్తుంటే, పిడుగు పడే అవకాశం కనబడగానే మోకాళ్లపై చేతులు పెట్టుకొని, తలవాల్చి ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల పిడుగు పడినప్పుడు విడుదలయ్యే విద్యుత్ ప్రభావం తక్కువగా పడే చాన్స్ ఉంటుంది.




# ఈ ఆలయానికి వెళ్లారంటే కాళ్లు వణకాల్సిందే



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అద్భుతమైన ప్రదేశాలు, పురాతన దేవాలయాలు ఉన్నాయి. ఒక్కసారి ఆలయానికి వెళ్లారంటే చాలు మనస్సు ఎంతో ప్రశాంతంగా అయిపోతుంది. కానీ ఈ ఆలయానికి వెళ్లారంటే చాలు కాళ్లు కనీసం నడవరాకుండా వణుకుతూ ఉంటాయి. అడుగు తీసి అడుగే వేసే పరిస్థితిలో కూడా ఉండరు అక్కడి వారు. ప్రస్తుతం ఈ ఆలయానికి సంబంధించిన ఓ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరి ఆ ఆలయం ఎక్కడ ఉంది, అక్కడికి వెళ్లిన వారి పరిస్థితి ఎందుకు ఇలా అవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. కొంతమంది వ్యక్తులు ఖాళీ సమయం దొరికిన వెంటనే కొత్త ప్రదేశాలను సందర్శించడానికి వెళ్తాడు. ప్రయాణం చేసేందుకు ఎంతగానో ఇష్టపడుతూ ఉంటారు. ప్రజలు తమ బిజీ షెడ్యూల్‌ల నుండి సమయాన్ని వెచ్చిస్తారు. వారి మానసిక స్థితిని మెరుగుపరచుకుంటారు. అలాగే చాలా మంది మౌంట్ తైషాన్ లా ఉండే చైనాలో ఎంతో ప్రసిద్ధిచెందిన అందమైన ప్రదేశానికి వెళు తుంటారు. సాధారణంగా 50-100 మెట్లు ఎక్కితేనే ప్రజల పరిస్థితి దిగజారిపోతుంది. అయితే పర్యాటకులు ఈ ప్రదేశానికి చేరుకోవడానికి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 6600 కంటే ఎక్కువ మెట్లు ఎక్కాలి. ఇక్కడికి ఎక్కిన తర్వాత మనిషి పరిస్థితి ఎలా ఉంటుందంటే వారి కాళ్లు వణుకుతూ కర్ర సాయంతో కూడా మెట్లు ఎక్కలేని పరిస్థితికి వచ్చేస్తారు. మన శరీరం నుండి మన కాళ్ళు మాయమైనట్లు అనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఆలయానికి సంబంధించిన ఓ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ప్రజలు తమ చేతుల్లో కర్రలు పట్టుకుని మెట్లు ఎక్కే పరిస్థితిలో కూడా లేరు. కొంతమంది కాళ్ళు వణుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. మెట్ల రెయిలింగ్ పట్టుకుని కష్టపడి కిందకు దిగే వారు ఎందరో కనిపిస్తున్నారు. అలాగే మరికొంత మందిని స్ట్రెచర్ల పై తీసుకెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ వీడియో ్ఠవఖీఅస్త్రవఅ అనే ఖాతా ద్వారా షేర్ చేశారు. ఇప్పటివరకు 2.5 కోట్ల మందికి పైగా ప్రజలు దీనిని చూశారు. ఈ వీడియోని చూసిన వారిలో కొంతమంది ఈ విధంగా తమ మనసులోని మాటలను పంచుకున్నారు. 'సోదరా, ఈ ప్రదేశానికి వెళ్లడానికి ఎవరు ధైర్యం చేయగలరు ?' అని రాస్తే మరొకరు 'అత్యుత్తమ వ్యక్తులు కూడా ఇక్కడికి ఎక్కే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. 'ఈ ప్రదేశానికి చేరుకున్న తర్వాత, చాలా మంది ప్రజలు ఇక్కడికి చేరుకున్న తర్వాత పశ్చాత్తాపపడుతున్నారు.

# ఈ 7 లక్షణాలు కనిపిస్తున్నాయా?



కాలక్రమేణా కంటి సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయి. గత 10 సంవత్సరాలలో 10 మంది పెద్దలలో ఆరుగురు దృష్టి లోపం తలెత్తుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అలాగే 40 శాతం మంది కొన్నిసార్లు చూడటంలో ఇబ్బంది పడుతున్నారు. 31 శాతం మంది తమ దృష్టి సరైనదని చెప్పారు. 74 శాతం మంది తమ కంటి చూపు బలహీనంగా ఉందని, దాని లక్షణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. 20 ఏళ్లుగా స్పెక్‌సేవర్స్‌లో ఆప్టోమెట్రిస్ట్‌గా ఉన్న నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జోసీ ఫోర్టే, మీ కళ్ళు బలహీనంగా మారుతున్నాయని మీరు గుర్తించే కొన్ని సంకేతాలు ఉన్నాయని చెప్పారు. వీటికి చికిత్స చేయకపోతే, మీ కళ్ళు వేగంగా క్షీణిస్తాయని అంటున్నారు. మీరు హోటల్‌లో ఆహారం తినడానికి వెళ్లినట్లయితే, ఫుడ్ మెనూ లేదా చిన్న పదాలను స్పష్టంగా చదవాలి. అలాగే స్పష్టంగా కనిపించకపోయినా.. మీరు దానిని దూరం నుండి చదవడంలో ఇబ్బంది ఉన్నా.. కంటి సమస్య ఉన్నట్లు గమనించాలి. మీ మొబైల్‌లో పదాలను బాగా చదవడంలో ఇబ్బంది ఉండటం. మీరు విషయాలను చదవడానికి ప్రయత్నించినప్పుడు మీ ముఖ కవళికలు మారుతాయి. చదవడానికి లేదా ఏదైనా పని చేయడానికి మీకు సాధారణం కంటే ఎక్కువ లేదా ప్రకాశవంతమైన కాంతి అవసరం కావచ్చు. మీ దృష్టి సాధారణం చదవడంలో దూరదృష్టిలో లోపం కావచ్చు. దూరం నుంచి చదువుతున్నప్పుడు కూడా అక్షరాలు అస్పష్టంగా ఉంటుంది. ఏదైనా చదువుతున్నప్పుడు, మొబైల్‌లో చదువుతున్నడు కంటి నుంచి నీళ్లు రావడం. చదివిన తర్వాత లేదా చక్కటి పని చేసిన తర్వాత కంటి ఒత్తిడి లేదా తలనొప్పి రావడం. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోండి - ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలను చేర్చండి. ఇవి మీ మొత్తం ఆరోగ్యానికి అలాగే మీ కళ్ళకు ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. విటమిన్ సి, ఆకు కూరలు, చేపలు, పాలకూర, నారింజ వంటి వాటిని మీ ఆహారంలో చేర్చుకోండి. హైడ్రేటెడ్ గా ఉండండి- కళ్లకు, మొత్తం ఆరోగ్యానికి తగినంత నీరు తాగండి. తగినంత నీరు తాగడం వల్ల కళ్లలో పొడిబారిన సమస్య తొలగిపోతుంది, ఇది కళ్లకు ఉపశమనం ఇస్తుంది. ధూమపానం మానేయండి- ధూమపానం అనేక వ్యాధులకు ప్రధాన కారణం. ఇది ముఖ్యంగా కళ్ల ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావం చూపుతుంది. ఇది కంటిశుక్లం, కంటి నరాల దెబ్బతినడం, దృష్టి లోపం, అంధత్వం వంటి సమస్యలను పెంచుతుంది. విరామం తీసుకోండి- ఎక్కువ సేపు స్క్రీన్ వైపు చూస్తూ ఉండటం వల్ల కూడా కళ్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. స్క్రీన్ సమయాన్ని తగ్గిస్తున్నప్పుడు. ప్రతి గంట తర్వాత 20 నిమిషాల విరామం తీసుకోండి.

# ల్యాప్ ట్యాప్ ముందు ఎక్కువ సేపు కూర్చుంటున్నారా?



ప్రస్తుతం చాలా మంది ల్యాప్ ట్యాప్ ముందు కూర్చొని పనిచేయడం సర్వసాధారణంగా మారుతోంది. ముఖ్యంగా సాఫ్ట్వేర్ ఇతరత్రా ఉద్యోగులు కూడా వర్క్ ఫ్రం హెూం పేరిట ఇంటి దగ్గర నుంచి పనిచేసుకుంటూ ఉంటారు. దీంతో ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ల్యాప్ ట్యాప్ లోనే పనిచేస్తున్నారు. దీనివల్ల ఎన్నో రకాల సమస్యలు కూడా ఎదురవుతున్నాయని పలువురు నిపుణులు తెలియజేస్తున్నారు. ల్యాప్ ట్యాప్ దగ్గర ఎక్కువ సమయం కూర్చోవడం మంచిది కాదంటూ వైద్యులు తెలియజేస్తున్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడతాయని తెలుపుతున్నారు. ల్యాప్ ట్యాప్ దగ్గర కూర్చొని పనిచేసే వారు కొన్ని విషయాలు తప్పక తెలుసుకోవాల్సి ఉన్నదట.. స్క్రీన్ వైపుగా ఎక్కువసేపు చూస్తే కంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని..దీనివల్ల కళ్ళు కూడా పోడి బారటం ,మెడ నొప్పి, సింట్రోమ్, భుజాల నొప్పి మెడ నొప్పి తీవ్రమైన ఒత్తిడి ఇతరత్రా సమస్యలకు దారి తీసేలా ఉంటుందట. ఎక్కువసేపు ల్యాప్ ట్యాప్ నడుమునొప్పి రావడమే కాకుండా ఉబకాయం కూడా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందట. ల్యాప్ ట్యాప్ ఉపయోగించేటప్పుడు ఒకే చోట కూర్చోవడం వల్ల బరువు పెరగడానికి కారణమవుతుంది. అందుకే కనీసం గంటకు ఒకసారైనా లేచి ఐదు నిమిషాలు అటు ఇటు నడచడం వల్ల చాలా ఉపయోగం ఉంటుంది. భుజాల మధ్యలోని వీపు కూడా బిగుసుకున్నట్టుగా ఉన్నప్పుడు ఎక్కువసేపు కూర్చోకుండా ఉండడమే మంచిది. ల్యాప్ ట్యాప్ ఎక్కువ గంటలు ఉపయోగించడం వల్ల శరీరం అలసిపోయేలా ఉంటుందట.. ఇది చాలా ప్రమాదం అంటూ వైద్యులు తెలియజేస్తున్నారు. అందుకే ఉదయం లేవగానే కాస్త ఎక్సర్సైజులు, వ్యాయామం చేయడం మంచిది.. ముఖ్యంగా ల్యాప్ ట్యాప్ ను తలకు సమానంగా ఉండేలా స్క్రీన్ ని సెట్ చేసుకోవాలి.. అప్పుడే కంఫర్ట్ గా కూర్చులో కూర్చున్న కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎక్కువసేపు ఏదైనా స్క్రీన్ ముందర కూర్చోవడం వల్ల నిద్రపైన చాలా ప్రభావం చూపిస్తుంది. దీంతో నిద్రలేని సమస్యలు కూడా ఏర్పడతాయి.

# వేసవిలో ఇంటిని చల్లగా ఉంచే మొక్కలివే..

వేసవి కారణంగా పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇండ్లల్లో ఉంటున్నవారు కూడా ఉక్కబోతలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లవల్ల ఉపశమనం లభిస్తుండవచ్చు.కానీ అందరూ వాటిని వాడే పరిస్థితి ఉండకపోవచ్చు. మరికొందరికి అలర్జీలు సమస్య దండవచ్చు. ఇలాంటివారు అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోవాలంటే, చల్లదనాన్ని ఆస్వాదించాలంటే ఇండ్లల్లో కూలింగ్ ప్లాంట్స్ పెంచుకోవడం మేలు చేస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఫికస్ మొక్క:ొక్కలు, చెట్లు సహజంగానే చల్లదనాన్ని ఇస్తాయి. అయితే కేవలం ఇంటి ఆవరణలో పెంచుకోగలిగే చల్లదనాన్ని ఇచ్చే కొన్ని ప్రత్యేక మొక్కలు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వాతావరణాన్ని చల్లగా మార్చడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అలాంటి వాటిలో ఫికస్ మొక్కలు ఒకటి. వీటిని ఇంటి ఆవరణలో మట్టి కుండీలల్లో పెంచడం ద్వారా వేడి గాలిని శుద్ధిచేసి చల్లదనాన్ని ఇస్తాయని నిపుణులు అంటున్నారు. బేబీ రబ్బర్ ప్లాంట్: చూడటానికి చిన్నగా ఉండే బేబీ రబ్బర్ ప్లాంట్ ఇంటిలో పెంచుకోవడానికి అనువైనది. పైగా ఈ మొక్కలకు డైలీ నీళ్లు కూడా పోయాల్సిన అవసరం లేదు. చుట్టు పక్కల వాతావరణాన్ని చల్లబరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇంటి ఆవరణలో పెంచుకోవడం ద్వారా పరిసరాలు, ఇంటి వాతావరణాన్ని మిగతా ప్రదేశాలతో పోల్చితే చల్లగా మారుస్తాయి. ఫెర్న్ ప్లాంట్: ఫెర్న్ మొక్క చల్లదనాన్ని ఇచ్చేదిగా ప్రసిద్ధి చెందింది. ఇండ్లల్లో పెంచుకుంటే వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెప్తుంటారు. ఎందుకంటే ఇది గాలిలో తేమను పీల్చి తనలో స్టోర్ చేసుకునే గుణం కలిగి ఉంటుంది. వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి ఆ తేమను విడుదల చేస్తుంది. ఎటువంటి పువ్వులు, కాయలు ఉండవు. కేవలం ఆకులతో ఉండే ఈ మొక్క చల్లదనాన్ని ఇవ్వడంలో మాత్రం అద్భుతంగా పని చేస్తుంది. దీంతోపాటు కలబంద మొక్క కూడా చల్లదనాన్ని ఇస్తుందని నిపుణులు అంటున్నారు.



# జర్మనీలో జాబ్ సెర్చ్ ఇక ఈజీ.. ఈ ఒక్క కార్డు చాలు!

జర్మనీలో జాబ్ చేయాలనుకుంటున్నారా.. మీకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలు ఉంటే ఈ దేశంలో చట్టబద్ధంగా ఉద్యోగ అవకాశాలను పరిశీలించవచ్చు. ఇందు కోసం 'ఆపర్చునిటీ కార్డు' పేరుతో ప్రత్యేక కార్డును ఆ దేశ ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. నైపుణ్యం కలిగిన ఉద్యోగార్థులు జర్మనీలో ఉంటూ ఉద్యోగం వెతుక్కునేందుకు వీలుగా జర్మనీ ప్రభుత్వం వచ్చే జూన్ నెల నుంచి ఈ కార్డు'ను జారీ చేయనుంది. విదేశీయులు తమ విదేశీ అర్హతల పూర్తి గుర్తింపును పొంది 'నైపుణ్యం కలిగిన కార్మికులు'గా పరిగణించబడే వారు ఎటువంటి ప్రత్యేక అవసరాలు లేకుండా ఈ ఆపర్చునిటీ కార్డును పొందవచ్చు. వారు శాశ్వత ఉద్యోగ ఒప్పందానికి సంబంధించిన రుజువును సమర్పించాల్సిన అవసరం లేదు. అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాలు పొందడాన్ని ఆపర్చునిటీ కార్డ్ సులభతరం చేస్తుంది. ఇది దరఖాస్తుదారులను సుదీర్ఘ గుర్తింపు ప్రక్రియ లేకుండా జర్మనీలో పని చేయడానికి అనుమతిస్తుంది. ఇందు కోసం కనీసం రెండు సంవత్సరాల వృత్తిపరమైన శిక్షణ లేదా విశ్వవిద్యాలయ డిగ్రీ, అలాగే జర్మన్ లేదా ఇంగ్లిష్‌లో నైపుణ్యం అవసరం. ఆపర్చునిటీ కార్డ్‌లను అభ్యర్థుల అర్హతను బట్టి గరిష్టంగా ఒక సంవత్సరం వరకు వ్యవధితో జారీ చేస్తారు. ఈ ?కార్డు ఉన్నవారు జర్మనీలో




ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవచ్చు. వారానికి గరిష్టంగా 20 గంటల పాటు తాత్కాలిక ఉపాధిని చేపట్టవచ్చు. అక్కడ మంచి ఉద్యోగం దొరికి నివాస హోదా పొందలేని అభ్యర్థుల విషయంలో ఈ ఆపర్చునిటీ కార్డును మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించుకునే అవకాశం ఉంది.

## హెచ్‌డీఎఫ్‌సీ అంచనాలు మిస్ క్యూ4లో 17,258 కోట్ల లాభం




**ముంబై :** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.17,257.87 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.17,257.87 కోట్ల కంటే ఇది కేవలం 2.11 శాతం అధికం. ఏడాది క్రితం రూ.18,170 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం గత త్రైమాసికానికి రూ.29,080 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. నికర లాభం విషయానికి వస్తే స్వల్పంగా పెరిగి రూ.16,373 కోట్ల నుంచి రూ.16,511 కోట్లకు చేరుకున్నది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.24 శాతంగా ఉన్నది. గతేడాది ఇది 1.26 శాతంగా ఉన్నది. నికర ఎన్‌పీఏ 0.31 శాతం నుంచి 0.33 శాతానికి పెరిగింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను బ్యాంక్ రూ.19.5 డివిడెండ్‌ను ప్రతిపాదించింది. బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.60 వేల కోట్ల నిధుల సేకరణకు సంబంధించి బ్యాంక్ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.13,500 కోట్ల నిధులు వెచ్చించింది. ఏడాది క్రితం ఇది రూ.10,900 కోట్లు కేటాయించింది. గత త్రైమాసికంలో 650 శాఖలను ప్రారంభించడంతో మొత్తం బ్రాంచ్‌ల సంఖ్య 8,738కి చేరుకున్నాయి.

## లాస్‌లో కంపెనీ.. సీఈవో మాత్రం ఫుల్ హ్యాపీ!



కంపెనీ లాస్‌లో ఉంటే సీఈవో ఫుల్ హ్యాపీ ఏంటి అనుకుంటున్నారా? మీడియా సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సీఈవో డేవిడ్ జస్లావ్ వార్షిక వేతన పరిహారం 2023లో దాదాపు 27 శాతం పెరిగి 49.7 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.414 కోట్లు) చేరుకుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కి సమర్పించిన ఫైలింగ్‌లో కంపెనీ ఈమేరకు పేర్కొంది. 2023లో నష్టాలను ఎదుర్కొన్న?ప్పటికీ సీఈవో వేతన పరిహారాన్ని మాత్రం కంపెనీ పెంచింది. ఆ ఏడాది వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.25 వేల కోట్లు) నష్టాలను చవిచూసింది. అయితే అంతకు ముందు ఏడాది కంటే నష్టాలు సగానికిపైగా తగ్గాయి. 2022లో కంపెనీ నష్టాలు 7 బిలియన్ డాలర్లుగా ఉండేవి. కాగా 2023లో కంపెనీ ఫ్రీ క్యాష్ ఫ్లో 86 శాతం పెరిగి 6.16 బిలియన్ డాలర్లకు చేరుకుందని నివేదించింది. కేబుల్ టీవీ క్షీణత, బలహీనమైన ప్రకటనల మార్కెట్, హాలీవుడ్ సమ్మెల పతనం కారణంగా ఒత్తిడితో ఫిబ్రవరిలో కంపెనీ ఊహించిన దానికంటే పెద్ద త్రైమాసిక నష్టాన్ని నివేదించింది. జాస్లావ్ 2022లో అందుకున్న 12 మిలియన్ డాలర్లతో పోలిస్తే 2023లో 23.1 మిలియన్ డాలర్ల స్టాక్ అవార్డులను అందుకున్నారు. కంపెనీ షేర్లు గత సంవత్సరం 20 శాతం పెరిగాయి. జస్లావ్ వేతనం 2022 నుంచి పెరిగినప్పటికీ, ఆయన 2021లో అందుకున్న 246.5 మిలియన్ డాలర్ల కంటే చాలా తక్కువ.

# 'ఐదు రోజుల పని'కి స్వస్తి.. ప్రముఖ కంపెనీ కీలక నిర్ణయం!

కార్పొరేట్ రంగంలో వారానికి ఐదు రోజుల పని ధోరణికి స్వస్తి పలుకుతూ ప్రముఖ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ శామ్‌సంగ్ కీలక నిర్ణయం తీసుకుంది. శామ్‌సంగ్ గ్రూప్ దాని ఎగ్జిక్యూటివ్‌ల కోసం కఠినమైన ఆరు రోజుల పని షెడ్యూల్‌ను ప్రకటించింది. కొరియా ఎకనామిక్ డైలీ వెల్లడించిన ఈ నిర్ణయం కార్పొరేట్ ల్యాండ్‌స్కేప్‌లో చెప్పుకోదగ్గ మార్పును సూచిస్తుంది. నివేదిక ప్రకారం.. ఆరు రోజుల పనివారం అమలు ప్రారంభమైంది. కొంతమంది ఉన్నత ఉద్యోగులకు ఈ వారంలోనే పొడిగించిన షెడ్యూల్‌ను అనుసరించాలని చెప్పారు. దక్షిణ కొరియా దిగ్గజం ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్య వచ్చింది. చమురు ధరలు పెరగడం, రుణ భారం అధికమవడం, దక్షిణ కొరియా కరెన్సీ వోన్ విలువ గణనీయంగా తగ్గడం వంటి అంశాలు శామ్‌సంగ్ నివేదికలో "అత్యవసర మోడ్"గా వర్ణించిన ఈ నిర్ణయానికి కారణాలుగా తెలుస్తోంది. గత సంవత్సరంలో ప్రధాన యూనిట్ల పనితీరు తక్కువగా ఉండటం వల్లే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు శామ్‌సంగ్ గ్రూప్‌లోని సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు పేర్కొన్నారు. కంపెనీ సాంకేతిక విభాగాలలో ఆరు రోజుల పనివారం తక్షణమే అమలులోగా భవిష్యత్తులో ఈ విధానాన్ని దాని ఆర్థిక సేవల రంగాలకు విస్తరించడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి.




# టీ20 వరల్డ్‌కప్‌కు నేనే రెడీ.. ఆ ముగ్గురి చేతుల్లో ఉంది..!


ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో ఇరగదీస్తున్న ఆర్సీబీ వెటరన్ దినేశ్ కార్తీక్.. 38 ఏళ్ల వయసులో వరల్డ్‌కప్ ఆడేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో గతంలో ఎన్నడూ లేనంత యాక్టివ్‌గా కనిపిస్తున్న డీకే.. ఈ ఏడాది జరుగబోయే టీ20 వరల్డ్‌కప్ ఆడేందుకు 100 శాతం రెడీగా ఉన్నానని ప్రకటించాడు. ప్రముఖ వార్త సంస్థతో డీకే మాట్లాడుతూ.. టీ20 వరల్డ్‌కప్ కోసం వనరులు (ఆటగాళ్లు) సమకూర్చే బాధ్యతలో ముగ్గురు (కెప్టెన్ రోహిత్, కోచ్ ద్రవిడ్ , చీఫ్ సెలెక్టర్ అగార్కర్) నిజాయితీపరులు, సమర్థులైన వ్యక్తులు ఉన్నారు. భారత్‌కు ఏది ఉత్తమమో వారికి బాగా తెలుసు. వారు ఏ నిర్ణయం తీసుకున్నా జట్టు అవసరాలకు అనుగుణంగా తీసుకుంటారు. నేను పూర్తిగా వారితో ఉంటాను. వారు తీసుకునే ఏ నిర్ణయాన్నైనా గౌరవిస్తాను. నేను చెప్పగలిగేది ఒక్కటే నేను టీ20 వరల్డ్‌కప్ కోసం వంద శాతం సిద్ధంగా ఉన్నాను అంటూ డీకే తన మనోభావాన్ని భయటపెట్టాడు. కాగా, డీకే టీ20 వరల్డ్‌కప్‌కు సెలెక్ట్ కావాలని చూస్తున్నట్లు ఇటీవలే రోహిత్ శర్మ చెప్పాడు. ఆర్సీబీతో మ్యాచ్‌లో సందర్భంగా



రోహిత్ డీకేను సరదాగా ఆటపట్టిస్తూ.. ఇతనికి వరల్డ్‌కప్‌కు సెలెక్ట్ కావాలిని ఉన్నట్లుందంటూ సరదాగా అన్నాడు. రోహిత్ మాటాలు స్టంప్ మైక్‌లో రికార్డయ్యాయి. కొద్ది రోజుల కింద దీనికి సంబంధించిన వీడియో బాగా వైరలైంది. ఇదిలా ఉంటే, దినేశ్ కార్తీక్ టీమిండియా తరఫున ఆడి చాలా కాలమైంది. 2022 నవంబర్ 2న బంగ్లాదేశ్‌తో ఆడిన టీ20 మ్యాచ్ డీకేకు టీమిండియా తరఫున చివరిది. అప్పటి నుంచి ఐపీఎల్‌కు మాత్రమే పరిమితమైన డీకే పార్ట్ టైమ్ కామెంటటేటర్‌గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లో బ్యాటింగ్‌లో ఇరగదీసిన డీకే.. గత సీజన్‌లో దారుణంగా విఫలమై మళ్లీ ఇప్పుడు సత్తా చాటుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడిన డీకే.. 75.33 సగటున 205.45 స్ట్రయిక్‌రేట్‌తో 226 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో డీకే ఆడిన ఇన్నింగ్స్ (35 బంతుల్లో 83) వేరే లెవెల్లో ఉంది. భారీ లక్ష్య ఛేదనలో డీకే పోరాడితే పోయేదేమీ లేదన్న చందంగా బ్యాటింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను చూపిన తెగువ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఇన్నింగ్సే కాకుండా డీకే ఈ సీజన్‌లో పలు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముంబైపై 23 బంతుల్లో 53 పరుగులు చేశాడు. కేకేఆర్‌పై 8 బంతుల్లో 20, పంజాబ్‌పై 10 బంతుల్లో 28.. ఇలా జట్టుకు ఉపయోగపడే పలు ఇన్నింగ్స్‌లు ఆడాడు. డీకే వయసు 38 ఏళ్లు అయినప్పటికీ.. అతను ఫిట్‌గా యాక్టివ్‌గా ఉన్నాడు. టీ20 వరల్డ్‌కప్ రేసులో కుర్ర వికెట్‌కీపర్ బ్యాటర్లకు డీకే నుంచి పోటీ తప్పకపోవచ్చు.

## రక్షకుడు జస్ట్ 22.. ఢిల్లీకి వరంలా దొరికిన ఫ్రేజర్

ఒకరి దురదృష్టం మరొకరికి అదృష్టంలా అంటుకుపోతుంది అనే సామెత వినే ఉంటాం. ఈ మాట ఐపీఎల్ నయా స్టార్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు అతికినట్టు సరిపోతుంది. టీ20ల్లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న ఫ్రేజర్ పదిహేడో సీజన్‌లో వేగవంతమైన అర్ధ శతకంతో చరిత్ర సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ భవిష్యత్ స్టార్‌గా ప్రశంసలు అందుకుంటున్న ఈ చిచ్చరపిడుగు అనుకోకుండా ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. పదిహేడో సీజన్ ఆరంభానికి ముందు స్టార్ పేసర్ లుంగి ఎంగిడి గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, అతడి స్థానంలో ఢిల్లీ 22 ఏండ్ల ఫ్రేజర్‌ను రూ. 50 లక్షలకు తీసుకుంది. అంతే.. ఢిల్లీకి ఓ రక్షకుడు వరంలా దొరికినట్టైంది. ఆడిన మూడు మ్యాచుల్లోనే ఫ్రేజర్ 222.2 స్ట్రయిక్ రేటుతో140 రన్స్ కొట్టి పాంటింగ్, గంగూలీ నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా జెర్సీ వేసుకున్న ఫ్రేజర్.. తొలి మ్యాచ్‌లోనే తన ప్రతాపం చూపించాడు. వెస్టిండీస్‌పై దుమ్మురేపి ఔరా అనిపించాడు. పొట్టి ఫార్మాట్‌కు పక్కాగా సరిపోయే ఫ్రేజర్ ఢిల్లీ మేనేజ్‌మెంట్ దృష్టిలో పడ్డాడు. ఇంకేముంది గాయపడిని ఎంగిడి స్థానంలో ఈ ఆసీస్ స్టార్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకుంది. తొలి మ్యాచ్‌లో నిరాశపరిచన ఫ్రేజర్.. రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై శివాలెత్తిపోయాడు. అర్ధ శతకంతో అజేయంగా నిలిచి ఢిల్లీని గెలిపించాడు.




## స్పోర్ట్స్

### ఓపెనర్‌గా హిట్ కొట్టేశాడు.. వరల్డ్ కప్ జట్టులో ఉంటాడా..?



'ఐపీఎల్‌లో ఇంతకు ముందు ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క' అంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఓ రేంజ్‌లో దంచుతున్నారు. ఇక ఓపెనర్ అభిషేక్ శర్మ అయితే కనికరమే లేదన్నట్టు బౌలర్లను ఊచకోత కోస్తున్నాడు. ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపిక నేపథ్యంలో అభిషేక్ ఫిరంగిలా రెచ్చిపోతున్నాడు. ఆసీస్ చిచ్చరపిడుగు ట్రావిస్ హెడ్‌తో పోటాపోటీగా సిక్సర్ల మోత మోగిస్తూ హైదరాబాద్ రికార్డు స్కోర్లకు బాటలు వేస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సంచనల బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న అభిషేక్ మ్యాచ్ అనంతరం తన విజయ రహస్యం చెప్పాడు. హెడ్‌తో ఓపెనింగ్ ఎంజాయ్ చేస్తున్నాని అన్నాడు. 'ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ చేస్తుంటే చూడడం ఇష్టం. అంతేకాదు ఆట గురించి మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకుంటా. ఇది మా కాంబో హిట్ అవ్వడానికి నిజంగా చాలా సాయం చేసింది. నేను కలిసి ఆడాలనుకున్న ఆటగాళ్లలో హెడ్ ఒకరు. ఆసీస్ తరఫున మూడు ఫార్మాట్లలో అదరగొడుతున్న హెడ్‌తో ఇన్నింగ్స్ ఆరంభించడం నిజంగా నా అదృష్టం' అని అభిషేక్ వెల్లడించాడు. అంతేకాదు పదిహేడో సీజన్ కోసం తానెంత కష్టపడ్డానికి ఈ యంగ్‌స్టర్ తెలిపాడు.

**ఏకంగా 24 సిక్సర్లు**

'పదిహేడో సీజన్‌కు ముందు ఎంతో కష్ట పడ్డా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రాణించడం ఇప్పుడు ఎంతో ఉపయోగపడుతోంది' అని అభిషేక్ చెప్పాడు. ఈ సీజన్‌లో హెడ్, అభిషేక్‌లు పవర్ ప్లేలో విశ్వరూపం చూపిస్తున్నారు. ఇప్పటివరకూ ఏడు మ్యాచుల్లో 227 రన్స్ కొట్టిన అభిషేక్ ఏకంగా 24 సిక్సర్లు బాదాడు. తొలుత ముంబై ఇండియన్స్(%వీబఎమ్ఖఉ ×అఆఖ్ఖఅం%)పై 16 బంతుల్లోనే యాభై కొట్టిన ఈ యువకెరటం.. ఆ తర్వాత బెంగళూరుపైనా మోత మోగించాడు.

# అన్నీ డిజాస్టర్ సినిమాలే..

## ఆ ఒక్క బ్లాక్‌బస్టర్ తన ఖాతాలో పడాల్సిందట!



మోడలింగ్ నుంచి సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన బ్యూటీ మానుషి చిల్లర్. సామ్రాట్ పృథ్వీరాజ్ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ సుందరి ఆపరేషన్ వాలంటైన్‌తో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది. కానీ అక్కడా, ఇక్కడా చేదు ఫలితాలే వచ్చాయి. తర్వాత బడేమియా చోటామియాలోనూ నటించగా అది కూడా వర్కవుట్ కాలేదు. ఇలా అన్నీ వరుస డిజాస్టర్లే అందుకుంటున్న మానుషి సక్సెస్ ట్రాక్ ఎక్కపోతే భవిష్యత్తు అంధకారంగా మారే అవకాశం ఉంది. నిజానికి తాను ఓ బ్లాక్‌బస్టర్ మూవీలో నటించాల్సిందని చెప్తోంది మానుషి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన కబీర్ సింగ్ మూవీలో కియారా అద్వానీ పాత్ర నేను చేయాల్సింది. హీరోయిన్‌గా నన్ను అనుకున్నారని చాలా ఆలస్యంగా తెలిసింది. అయితే అప్పుడే నేను ప్రపంచ సుందరి కిరీటం అందుకోవడంతోపాటు ఏడాదిపాటు వారితోనే కలిసి పని చేస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాను. దానివల్ల కబీర్ సింగ్‌లో నటించలేకపోయాను అని చెప్పుకొచ్చింది. మొత్తానికి మానుషి రూ.350 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన బ్లాక్‌బస్టర్ మూవీని మిస్ చేసుకుందన్నమాట! ప్రస్తుతం ఈ బ్యూటీ జాన్ అబ్రహం సరసన టెహ్రాన్ అనే సినిమాలో నటిస్తోంది.

# 2026 వరకు ప్రభాస్ డైరీ ఫుల్..




బాహుబలి సినిమాతో ప్రభాస్ పాన్ ఇండియా స్టార్ అయిపోయాడు. బాహుబలి ది కన్ క్లూజన్ తర్వాత ఆయన నటించిన చిత్రాలన్నీ పాన్ ఇండియా స్థాయిలో విడుదలైనవే. అయితే వీటిల్లో చాలా వరకు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. అయితే కూడా ప్రభాస్ ఇమేజ్‌కి కొంచెం కూడా డ్యామేజ్ కాలేదు. ఇంకా చెప్పాలంటే పాన్ ఇండియా నుంచి పాన్ వరల్డ్‌కి ఆయన మార్కెట్ పెరిగిపోయింది. ప్రస్తుతం ఏ పాన్ ఇండియా హీరో చేతిలో లేనన్ని సినిమాలు ప్రభాస్ చేతిలో ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా ఏ డైరెక్టర్ అయినా ప్రభాస్‌తో సినిమా చేయాలంటే మరో రెండేళ్ల వరకు ఆగాల్సిందే. 2026 వరకు ఆయన డైరీ ఖాళీగా లేదు. ప్రభాస్ ప్రస్తుతం కల్కి 2898 సినిమాలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది. దీంతో పాటు మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ చిత్రం చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతోంది. ఆ తర్వాత సందీప్ రెడ్డి వంగాతో ఓ సినిమా చేయనున్నాడు. ఈ చిత్రానికి స్పిరిట్ అనే టైటిల్ ఖరారు చేశాడు. ఇది కూడా పాన్ వరల్డ్ స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. వీటితో పాటు సలార్ సీక్వెల్ ఉంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించే ఈ చిత్రం షూటింగ్ కూడా ఈ ఏడాదిలోనే ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అలాగే కల్కి చిత్రానికి కూడా రెండో భాగం ఉంది. వీటితో పాటు మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న 'కన్నప్ప'లోనూ ప్రభాస్ ఓ కీలక పాత్ర పోషించబోతున్నట్లు వార్తలు వస్తున్నా యి. ఈ చిత్రాలన్నీ పూర్తవ్వడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాత హను రాఘవపూడితో ఓ సినిమా చేయబోతున్నాడు.

# గెట్ రెడీ.. డబుల్ ఇస్మార్ట్ సెట్స్‌లో రామ్



టాలీవుడ్ మోస్ట్ ఎవెయిటెడ్ కాంబోల్లో టాప్‌లో ఉంటుంది ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో రఫ్ఫాడించిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ సీక్వెల్ ప్రాజెక్ట్‌కు మించిపోయే వినోదాన్ని అందించేందుకు ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్ కూడా వస్తుందని తెలిసిందే. అప్‌డేట్స్ కోసం చూస్తున్న అభిమానుల కోసం చాలా రోజుల తర్వాత స్టిల్ రూపంలో డబుల్ ఇస్మార్ట్ వార్త బయటకు వచ్చింది. రామ్, పూరీ సెట్స్‌లో సరదాగా చిట్ చాట్ చేస్తున్న స్టిల్‌ను మేకర్స్ షేర్ చేశారు. డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు రెడీగా ఉండుండి.. అంటూ ఈ స్టిల్‌తో రెడీగా ఉండండి అంటూ పూరీ చెప్పకనే చెబుతున్నాడంటున్నారు సినీ జనాలు. ముంబైలో డబుల్ ఇస్మార్ట్ క్లైమాక్స్ ఫైట్ సీన్ ప్లాన్ చేశాడని.. ఈ సీన్ కోసం ఏకంగా రూ.7 కోట్లు పెడుతున్నాడని ఇప్పటికే ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన మణిశర్మ సీక్వెల్‌కు అదిరిపోయే ఆల్బమ్ రెడీ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూన్ 14న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇస్మార్ట్ ఈజ్ బ్యాక్.. ఈ సారి డబుల్ ఇంపాక్ట్.. అంటూ శక్తిమంతమైన త్రిశూలం.. బ్యాక్ డ్రాప్‌లో మంటలు కనిపిస్తున్న స్టిల్‌ను మేకర్స్ లాంఛ్ చేయగా.. సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో రైట్స్‌ను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ దక్కించుకుంది. ఈ మూవీ నుంచి రామ్ స్టైలిష్ గాగుల్స్ పెట్టుకొని గన్స్ మధ్య స్టైలిష్‌గా ఉన్న డబుల్ ఇస్మార్ట్ లుక్‌కు ఇంప్రెస్ అవుతున్నారు ఫ్యాన్స్.

# కమల్‌హాసన్ అభిమానులకు డబుల్ బొనాంజా!



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో వయస్సుతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ.. ఏ మాత్రం తగ్గేదేలే అనే ఫార్ములాను పర్‌ఫెక్ట్‌గా అప్లై చేస్తున్న వారి జాబితాలో ముందు వరుసలో ఉంటాడు ఉలగనాయగన్ కమల్‌హాసన్ .ఈ విలక్షణ నటుడు ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కమల్ హాసన్ ఖాతాలో ఇండియన్ 2 థగ్ లైఫ్ సినిమాలున్నాయి. మరోవైపు ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న కల్కి 2898 ఏడీ లో కీ రోల్ కూడా చేస్తున్నాడు కమల్ హాసన్. ఇదిలా ఉంటే కమల్ హాసన్ అభిమానులను ఖుషీ చేసే వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఇండియన్ 2 జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు ఇప్పటికే వార్తలు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు కమల్ హాసన్ కీ రోల్ చేస్తున్న కల్కి 2898 ఏడీ కూడా ఇదే నెలలో రాబోతున్నట్టు తెలుస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ జూన్ 20న థియేటర్లలో సందడి చేయనుంది. ఒకవేళ ఇదే నిజమైతే జూన్‌లో ఉలగనాయగన్ అభిమానులకు డబుల్ ఫీస్ట్ పక్కా అయిపోయినట్టేనన్నమాట. మరి ఇక మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే తరువాయి. ఇండియన్ 2లో కాజల్ అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాబీ సింహా, సిద్దార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ -రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్-సుభాస్క రన్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కమల్ హాసన్ సీక్వెల్‌తోపాటే ఇండియన్ 3 షూటింగ్ కూడా పూర్తి చేశామని చెప్పి అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. ప్రస్తుతం ఇండియన్ 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి

# 'దేవర'లో స్టార్ హీరోయిన్ ఐటమ్ సాంగ్?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దేవర' కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ రూమర్ బయటకు వచ్చింది. ఈ మూవీలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజ హెగ్డే స్పెషల్ సాంగ్‌లో మెరవబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ విషయంపై పూజను చిత్రయూనిట్ సంప్రదించగా.. పూజ ఓకే చేసినట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పూజ హెగ్డే ఇంతకుముందు రామ్ చరణ్‌తో రంగస్థలం సినిమాలో జిగేలు రాణి అంటూ ఐటెం సాంగ్‌తో మెరిసింది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com